అరుణతార

సాహిత్య - సాంస్కృతిక మాసపత్రిక

విషయ సూచిక

నక్సల్బరీ హామ్స (కవిత) -నమ్మ...

సూర్యుణ్ణి పైకెత్తాలి (కవిత) -బెంగాలీ గిరిజన ఖైదీ

సంపాదకీయం :

ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి -విరసం కార్యవ...

పాటమీద వెన్నెల నడుస్తూంది (కవిత) - అజ్ఞాత సూరీడు -

జాలిమొగిలాలో (పిల్లలపాట) - ... -

మా ప్రపంచం (కవిత) -హెచ్చార్కె - 11

నువ్వూ - నేనూ (కవిత) -కె. రాంమోహనరాజు - 13

ఎర్రని చరిత్రకోసం (కవిత) -ఉప్పల అప్పలరాజు - 14

విప్లవకారులు (కవిత) -చెర్ పేట - 14

జెండా సంరక్షకులు -సాకి. - 15

మార్క్సిజం - వస్తుమానవవాదం (చర్చావ్యాసం)

-త్రిపురనేని మధుసూదనరావు - 21

బలిపీఠం (కవిత) ... - 35

- 36

...య్య - 37

45

1 KLVA101M02

అరుణతార

సాహిత్య - సాంస్కృతిక మాసపత్రిక 30

నక్సల్బరీ హమ్స

—నమ్మ

పాల ఒంట్లోకి పాకిన
నీటి కుట్రల
కుతిక పిసికేస్తుంది (ట) హమ్స.
మెరుగురాయి కల్తీ బంగారం
మెడ కత్తిరించినట్టు !
తెల్లనివన్నీ పాలు కావు
తెల్లనివన్నీ పాలు కావు! కావు.

త్యాగాల రక్తపుజెండా రంగుని
మొహాల కద్దుకొని
ఓట్ల అంగట్లలో పాతిన
'ఎత్తుగడ'ల జెండామడతల్లో ముడుచుకొని
చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే
విద్రోహాల విషకంఠాల్ని ఛేదించింది
నక్సల్బరీ హమ్స !

మార్క్సిజాన్నుంచి రివిజనిజాన్ని విడగొట్టింది
పాలనుంచి నీళ్ళను విడగొట్టినట్లు
నక్సల్ బరీ (హ) హిమ్స.

సంపాదకుడు : కె. వి. రమణారెడ్డి, 11-33-957, కావలి 524202
ఉపసంపాదకుడు : వి. చెంచయ్య, లెక్చరర్, జవహర్ భారతి, కావలి 524202
మేనేజరు : సి.యస్.ఆర్.ప్రసాద్, సి-108, శ్రీనివాసనగర్, గుంటూరు 522006

విప్లవ రచయితల సంఘం

సూర్యుణ్ణి పైకెత్తాలి

స్వేచ్ఛానువాదం : శివనాగుల జయ్

ఇంకెంత దీర్ఘకాలం ఈ నిశిరాత్రి
గింజలు నిండుకున్నాయి ఇంట్లో

నీళ్ళు నిండిన కళ్ళతో
గుండె కొలిమిగా మారింది
నా (భూ)తల్లిని కాపాడ్డానికి నిస్పృహోయుణ్ణి

అవధులు లేని ఓరిమి
సహనం చిట్లిపోయింది
ప్రవాదశాల పాదముద్రల బరువుకి
కొండ చరియలు కంపించడం వింటున్నాను
ధనమదాంధతకు నిప్పంటుకుంది

ఒక్కసారిగా
నా హృదయం ఉగ్రతత లూగుతోంది
వద్దు –
సంకెళ్ళతో నన్నింక బంధించకండి
ఓహ్ !
తూర్పున
సూర్యుణ్ణి
పైకెత్తడానికి వెళ్ళాలి !

(1975.... మిడ్నాపూర్ జైల్లో.... సి. పి. ఐ. (యం. యల్) కు చెందిన విరతశరాస్యుడైన గిరిజన ఖైదీ పాడింది. మనోరంజన్ బిశ్వాస్ రాసిపెట్టారు.)

—ఒకడుగు వెనక్కి— రెండడుగులు ముందుకి—

విప్లవం ఈ నాటికి సంస్కరణవాదం నుంచి విముక్తి పొందలేదు. గతి తార్కిక భౌతిక వాదాన్ని ఆచరణలోకి అనుభవంలోకి అనువదించుకోవడంలో విప్లవకారులు విజయవంతంకాలేదు. సామాజిక అస్తిత్వాన్ని సకల అంశాల్లోనూ విప్లవీకరించడానికి గతితార్కిక భౌతిక వాదాన్ని అన్వయించుకోవడంలో ప్రదర్శించవలసిన శ్రద్ధని ప్రదర్శించడంలేదు. సంస్కరణవాదం ఉదారవాదం, నిర్లిప్తతావాదం కలిసి, జీవిత విప్లవీకరణకర్తవ్యాన్ని నిరోధిస్తున్నాయి సంస్కరణవాదం మనిషి మౌలికంగా మారకుండానే మార్పుని సాధించవచ్చునని భ్రమకలిగిస్తుంది. ఎప్పటికప్పుడు తాత్కాలిక తృప్తిని కలిగిస్తూ సర్దుబాటు మనస్తత్వాన్ని పెంచుతూ విప్లవ చైతన్యాన్ని దెబ్బతీస్తుంది. ఉన్న జీవితంమీద ఆశపెంచుతుంది. అమానవతనీ అతాత్వికతనీ భరించడం అలవాటు చేస్తుంది. ఆచరణలో ఆలోచనల్లో అశాస్త్రీయమైన సంప్రదాయికమైన అంశాల్ని ఇంకాబలంగా ఉంచుతుంది. ఉన్నత సమాజ దర్శనం మీద ఉక్కు తెరని వేస్తుంది. ఆర్థిక, సాంఘిక, తాత్విక రాజకీయ రంగాల్లో సంస్కరణవాదం వీరవిహారం చేయడమేకాదు. అది సాంఘిక అస్తిత్వాన్నిఆవరించుకొని ఉంది.

ఈనాటి పాలకవర్గాల అధికార రూపమైన రాజ్యాంగయంత్ర భావజాలం దోపిడీవర్గాల అధికారాన్ని కాపాడే చట్టబద్ధత అస్తిత్వాన్నీ చైతన్యాన్నీ మూస పోసి అధికార శక్తులకి విధేయం చేసింది. విధేయత జీవన లక్షణంగా మారిపోయింది. స్వేచ్ఛారాజ్యాన్ని గురించిన స్పృహకూడాలేకుండ చేసింది. రాజ్యాంగ యంత్రం, విద్యాసంస్థలూ, గుళ్ళూగోపురాలూ, ఆఫీసులూ,కుటుంబంవంటి సామాజిక సంస్థలన్నీ పాలక వర్గభావజాలమైన సంస్కరణ ఊబిలో కూరుకుపోయాయి. అన్యాయం, అణిచివేత, హత్యాకాండ, మానసిక హింస, ఆకలి, అజ్ఞానం, అనారోగ్యం, హింస చాలా సహజమైన విషయాలుగా, మానవస్వభావంలో భాగాలుగా, శాశ్వతంగా ఉండిపోయే అంశాలుగా పరిగణించడం అలవాటుగా మారిపోయింది. ఇవి వ్యక్తుల అంతరంగంలో ప్రవేశించి అధైర్యం, భయం, ఆందోళన, అధీనత, అల్పత్వంగా రూపొందుతున్నాయి. సాధారణమానవులసంఖ్య తగ్గి ఆకారమానవుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రతివాడూ నిజస్వరూపాన్ని ప్రచ్ఛన్నం చేసుకొని ఒక

కృత్రిమ రూపంతో సమాజంలో వ్యవహరిస్తున్నాడు. స్త్రీపురుషులమధ్యకూడామానవ బంధాలు తెగిపోయి నటన నాట్యం చేస్తోంది. హింసించి ఆనందించే, హింసపడుతూ ఆనందించే అమానుషత బూర్జువా రాజ్యాంగ యంత్ర ఆంతరంగిక రూపమే. మార్పుని నిజాయితీతో కోరేవాళ్ళు తమ అస్తిత్వంలో కరిగిపోయి సహజభాగంగా పెనవేసుకుపోయిన సంస్కరణ తత్వం నుంచీ బయట పడలేదని గ్రహించలేక పోతున్నారు. అలా గ్రహించలేక పోవడం వల్లనే సంస్కరణతోకగాగల విప్లవ సాహిత్యాన్ని రాస్తున్నారు. దీన్తో విప్లవ సాహిత్య ఉద్యమంలో అనేక అర్ధ విజయాలూ, అపజయాలూ సంభవిస్తున్నాయి. ఒక దానిమీద దృష్టి కేంద్రీకరించి దాన్ని విప్లవీకరించడానికి, ప్రయత్నంచేయడంలో దానివి అంటిపెట్టుకొని ఉండే మరొకటి సంస్కరణ రూపంలో వచ్చి దాన్ని నిరోధిస్తోంది. రాజకీయంగా విప్లవకారుడు సాహిత్యంతో సంస్కరణ వాది అవుతున్నాడు. సాహిత్య విప్లవకారుడు రాత్యికంగా సంస్కరణ వాది అవుతున్నాడు. అస్తిత్వంలో చైతన్యంలో ఆచరణలో జీవన వైఖరిలో మొత్తంగా వేళ్ళ నుంచీ పై దాకా విప్లవీకరణం జరగక పోతే సంస్కరణని వదిలించుకోలేం. విప్లవం విజయవంతం అయినతర్వాత మాత్రమే సంస్కరణకి విప్లవశీలం ఉంటుంది, విప్లవపూర్వసంస్కరణ విప్లవాన్ని నిరోధించే ప్రతీపశక్తి.

సాహిత్యం ఒకజీవిత శకలాన్ని కాక, జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. అందుకనే జీవితాన్ని విప్లవీకరించే శక్తి సాహిత్యానికి ఉంది. సాహిత్యానికి ఉండే ఈ విప్లవీకరణశక్తిని మార్క్స్, లెనిన్, మావోలు, అంటే, గతితార్కిక భౌతిక వాదులు మాత్రమే శాస్త్రీయంగా గుర్తించారు. మార్క్సిజానికి నిబద్ధులైన రచయితలు కూడా సంస్కరణాంశాన్ని జయించలేక పోతున్నారు. విప్లవం వైపు ప్రజాభిప్రాయాన్ని సుముఖం చెయ్యడం, రచయితల్ని మేధావుల్ని విప్లవాభిమానులుగా చెయ్యడం, విప్లవ పోరాటాల్ని ప్రతిబింబించటం, విప్లవవ్యతిరేక శక్తుల్ని విమర్శించడం వరకే విప్లవ సాహిత్యం పరిమితంగా ఉంది. సిద్ధాంతానికి ఆచరణకి, ఆచరణకి సిద్ధాంతానికి ఐక్యతలేకపోవడం, ఆచరణనుంచీ వస్తున్న నూతన అనుభవాల్తో సిద్ధాంతాన్ని సంపన్నం చేయకపోవడం, సృజనాత్మకంగా మార్చడానికి ఆయుధంగా ఉపయోగించవలసిన సిద్ధాంతాన్ని 'ప్రమాణంగా' మాత్రమేగ్రహించడంవల్లా సంస్కరణ అంశాన్ని అధిగమించలేక పోతున్నాం. సిద్ధాంత ఆచరణ ఒకటిగా చేయగలిగినప్పుడే సాహిత్యంతో జీవితాన్ని విప్లవవంతం చెయ్యగలం.

విప్లవీకరణకి తపనపడుతున్న జీవిత పార్శ్వాలన్నింటినీ ప్రతిబింబించగలం. అస్తిత్వాన్ని విప్లవీకరించగలం. సంస్కరణని అధిగమించగలం. సమాజంలో ఇప్పుడు ఉన్నవి ఏవీ ఉండదగినవికావు. ఉండదగినవి ఆరూపంలో ఉండదగినవికావు. మొత్తంగా సామాజిక అస్తిత్వాన్ని మార్చవలసిందే. విప్లవరచయితల జీవితంలో పేరుకుపోయిన సంస్కరణ తత్వాన్ని విసర్జించకుండా విప్లవంలో సాహిత్యం పాత్రని నిర్వహించలేదు.

గతి తార్కిక భౌతిక వాదాన్ని కూడా ఎర్ర సంస్కరణవాదులు (రివిజనిస్టులు) సంస్కరణ వాదంగా మార్చివేశారు. ప్రజాసంఘం పేరుతో రచయితల్ని ఒక వేదికలోకి తెచ్చి పేదల పక్షాన సానుభూతినీ, పక్షపాతాన్నీ ప్రదర్శించమని బతిమాలుతున్నారు. సమాజ అస్తిత్వాన్ని విప్లవీకరించడం కాక వీళ్ళు విమర్శనాత్మక వాస్తవికత పేరుతో సమాజాన్ని విమర్శించే వలయంలో కూరుకుపోయారు. కేవల విమర్శ నిరాశకి నిష్క్రియాపరతకి దారి తీసి శుష్క ఆదర్శవాదంగా సంస్కరణ వాదంగా పరిణమిస్తుంది ఎర్ర సంస్కరణవాదులూ తెల్లసంస్కరణ వాదులూకరచాలనం చేసుకొని ఆలింగనం చేసుకొని బూర్జువారాజ్యాంగయంత్ర మంత్రనగరంలోకి నిష్క్రమించారు. ఆచరణఎలాగూ లేదు, మాటల్లో కూడ చేవచచ్చింది. సామాజిక జీవితంలో ప్రతిష్టంభనకి మనుషుల మనస్సులో భావభూతాలకి సంస్కరణవాదం జీవాన్ని పోస్తుంటే ఎర్ర సంస్కరణ వాదం సంస్కరణని విప్లవం అని భ్రమ కలిగిస్తోంది. ఈ సంస్కరణ తత్వం మాటల్తోపోదు. మాటల ఈటెల్తో కాదు. ఈటెల్తో కలిసినమాటల్తో పెకలించాలి. జీవితాన్నీ చైతన్యాన్నీ సంస్కరణనుంచీ విప్లవీకరణ జరిపే క్రమాన్ని విప్లవసాహిత్యం వేగవంతం చెయ్యాలి. విప్లవ సాహిత్య ఉద్యమంలో సంస్కరణ ఇంకా అజ్ఞాతంగా ఉంది. ఇది విప్లవసాహిత్య వికాసాన్ని నిరోధించే ప్రచండ శక్తులలో ఒకటి.

ఉదారవాదం సంస్కరణ వాదంతోనే పుట్టి అది ఒక సంస్కారంగా ఒక విలువగా, మానవతా లక్షణంగా జన జీవితంలో ప్రవేశించింది. రాజీపడడం, స్వసుఖ స్పృహ, స్వార్థం, సిద్ధాంత పరంగా నిలకడలేకపోవడం, సమిష్టిలో పూర్తిగా సంఘటితం కాకపోవడం, అందరితోనూ స్నేహంగా ఉండాలనుకోవడం, ఇతరుల్ని బాధ పెట్టకుండా ఉండాలనుకోవడం, ఉదారవాద లక్షణాలు. ఆచరణలో అవకాశవాదం, తప్పించుకు తిరిగే ధోరణి, తాను విప్లవీకరించబడకుండా

లోకానికి విప్లవాన్ని గురించి చెప్పడం, తాను త్యాగం చెయ్యకుండా ఇతరులకి త్యాగాన్ని బోధించడం, విప్లవాన్ని వ్యతిరేకించే వాళ్ళని వ్యతిరేకించకుండా ఉండటం, విప్లవాన్ని ఆమోదించే వాళ్ళదగ్గరే విప్లవాన్ని ఆమోదించడం ఉదారవాదలక్షణం. ఉదారవాదం సాహిత్యంలో శిల్పవాదంగానూ, పాండిత్య ప్రదర్శనావాదంగానూ. స్వకీర్తి వాదంగానూ మారుతుంది. ఉదారవాదానికి పెటీ బూర్జువా స్వార్థం మూలం. ప్రజల పక్షాన, ప్రజలపోరాటాల పక్షాన మాట వరసకి నిలిచి వాస్తవంలో రచయితల్లో గుర్తింపుకోసం తపనపడటం, చిన్ని చిన్ని బృందాల్లో మాత్రమే ఉండగలగడం, ఇంటి పక్షిగా ఉండడం, పెళ్ళాం బిడ్డల్తో మొగుడూ సంతానంతో అనుబంధం పోరాటంతో అనుబంధంకంటే ఉన్నతమైనదిగా భావించడం, కామ్రేడ్స్ కంటే స్నేహితుల్ని సన్నిహితులుగా భావించడం ఉదారవాది లక్షణాలు. తనని పొగిడిన వాళ్ళే, తన రచనని ప్రశంసించిన వాళ్ళే తనవాళ్ళు అనుకోవడం, మతాలు కట్టే మన స్వత్వం ఉండటం ఉదారవాది లక్షణాలు. ఈ ఉదారవాదం విప్లవ సాహిత్యాన్ని పెటీబూర్జువా సాహిత్యంగా మార్చివేస్తుంది. ఈ ఉదారవాదం కూడా విప్లవరచయితల్లో ఉంది. దీన్ని జయించకపోతే విప్లవసాహిత్య వేదిక అవకాశ వాదుల వేదికగా మారిపోతుంది.

రచయితలూ, మేధావులూ లేకుండా విప్లవం విజయవంతంకాదు. అలాగని రచయితలూ మేధావులే విప్లవాన్ని విజయవంతం చెయ్యలేరు. రచయితలు కార్మిక రైతాంగంతో మమేకం అయినప్పుడే విప్లవ రచయితలు కాగలరు. విప్లవం మౌలిక మార్పునీ, గుణాత్మక మార్పునీ, సామాజిక అస్తిత్వ మార్పునీ కోరు తుంది మౌలిక విప్లవాన్ని మౌలిక అవసరాలు ఉన్న వర్గమే సాధించగలుగు తుంది కార్మిక రైతాంగ వర్గాలే మౌలిక విప్లవ వర్గాలు. దోపిడీ చరిత్రలేని ఈ వర్గాలే దోపిడీలేని సమాజాన్ని సాధించగలవు. అందుకనే విప్లవ రచయితలు మౌలిక విప్లవ వర్గాల్తో మమేకం కావాలి. ప్రజల పోరాటాల్ని గురించి రాయడమే కాదు, ప్రజల పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గోవాలి. జీవిత అస్తిత్వంలో పోరాట సకల వ్యాప్తిని విప్లవరచయితలు చిత్రించాలి. సామాజిక అస్తిత్వం మూల మట్టంగా విప్లవీకరించ వలసిన అనివార్యతని విప్లవ రచయితలు జీవితాన్ని సమ గ్రంగా చిత్రించి నిరూపించాలి. అప్పుడే సంస్కరణ, ఉదారవాదాల్ని జయించి జీవకాంతిగల, యుద్ధశీల సాహిత్యాన్ని సృజించ గలరు. ప్రజల్నుంచీ నేర్చుకో కుండా ప్రజలకి చెప్పడం సాధ్యం కాదు. ఎలా రాయాలి? ప్రజల్తో మమేకం

అయినప్పుడే ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. విరసం తక్షణం పరిష్కరించుకోవలసిన సమస్య ఇది.

నిర్లిప్తవాదం విప్లవ రచయితని ఒంటరిచేస్తుంది. నూతన అనుభవాల్ని జీర్ణంచేసుకోవడాన్ని నిరోధిస్తుంది. వెనకచూపు పెంచుతుంది. వ్యక్తిగత జీవితంలో సంప్రదాయానికి విధేయంగా ఉండేటట్టూ చేస్తుంది. సంప్రదాయాన్ని వదిలించుకోవడం సులభంకాదు. నిరంతర అధ్యయనం, సమిష్టి అధ్యయనం, విద్యార్థి యువ జనంతో కలిసి మెలిసి ఉద్యమ నిర్మాణంలో కృషిచెయ్యడం ద్వారా నిర్లిప్తతని వదిలించుకోవచ్చు. మనదేశ చరిత్రని, కనీసం ఆధునిక చరిత్రని అధ్యయనం చేసి తీరాలి. చరిత్ర గమనాన్ని అధ్యయనం చెయ్యకుండా చారిత్రిక కర్తవ్యాన్ని నిర్వహించలేము. మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం మన ప్రాపంచిక దృక్పథం. ప్రాపంచిక దృక్పథం అంటే కొటేషన్ల పరిజ్ఞానం కాదు. అది రచయిత జీవితంలో, వ్యక్తిత్వంలో ఆచరణలో భాగం అయిపోవాలి. Stand-point Methodology చాలా కీలకమైన అంశాలు. ఈ రెండూ లేకుండా మార్క్సిజంలో ప్రత్యక్షరం తెలిసినా ప్రయోజనం లేదు. మార్క్స్, ఏంగెల్సు, లెనిన్, స్టాలిన్, మావోలు సమస్యల్ని అధ్యయనం చేసిన పద్ధతిని, సమస్యల్ని పరిష్కరించిన తీరునీ మనం ముఖ్యంగా అధ్యయనం చెయ్యాలి. మన సామాజిక అస్తిత్వ సమస్యలకి, చైతన్య సమస్యలకీ అన్వయించుకోవాలి. ఈ అన్వయం వల్ల విప్లవ సాహిత్యం, ప్రాపంచిక దృక్పథం రెండూ సుసంపన్నం అవుతాయి. ప్రాపంచిక దృక్పథం విప్లవ సాహిత్య ఉద్యమానికి విరోధకం కాదు. ప్రాపంచిక దృక్పథం పట్ల నిర్లిప్తంగా ఉండడంవల్లనే విప్లవ సాహిత్యం నిర్జీవం అవుతోంది. విప్లవ సాహిత్య ఉద్యమ నిర్మాణానికి విద్యార్థుల్నీ, యువకుల్నీ, సమీకరించాలి. విద్యార్థుల్తో యువకుల్తో కలసి మెలసి ఉండటం వల్ల విప్లవసాహిత్యం ఉద్యమంగా ఉధృతం కావడమేకాక విప్లవరచయితలకి ఉత్సాహం, పనిలోపట్టుదల, రచనలో ఉత్తేజం వస్తాయి. ఈ విషయంలో విప్లవరచయితలూ విప్లవవిద్యార్థులూ. నిర్లిప్తంగా ఉండకూడదు. ఈ నిర్లిప్తత విప్లవ సాహిత్య ఉద్యమాన్ని దెబ్బతీస్తుంది. ప్రజారాజకీయాల ఆధిపత్యాన్ని ఆమోదించడం అంటే కార్మిక, రైతాంగ, విద్యార్థి యువజన పోరాటాల్లో విప్లవరచయితలు మమేకం కావడమే.

చాలామంది విప్లవ రచయితలు విప్లవరచయితల సంఘం బయట కూడా ఉన్నారు. స్వల్ప అభిప్రాయభేదాలూ, వేదికావసరాన్ని గుర్తించక పోవటం మాత్రమే ఈ స్థితికి కారణం. అభిప్రాయభేదాలు లేకుండా ఏ సంఘమూ ఉండదు. అభిప్రాయభేదం ఉన్న ప్రతిఒకరూ ఒక వేదిక నిర్మించటానికి ప్రయత్నం చెయ్యడం సమంజసం కాదు. దశాబ్దం పైగా వి ర సం విప్లవ రచయితలకి ప్రధాన వేదికగా ఉంది. విప్లవరచయితలు అందరూ ఒక వేదికలో ఉండటం అవసరం.

కార్మిక రైతాంగంతో మమేకం కావడాన్నీ, మార్క్సిజం_లెనినిజం మావో ఆలోచనా విధానాన్ని ప్రాపంచిక దృక్పధంగా ఆమోదించే రచయితలు అందరూ విప్లవ రచయితల సంఘంలోకి సమీకృతులుకండి. ఇది చారిత్రిక అవసరం.

విప్లవం వర్ధిల్లాలి
విప్లవరచయితల సంఘం వర్ధిల్లాలి.

—కార్యదర్శి
విరసం

పాటమీద వెన్నెల నడుస్తూంది

-అజ్ఞాత సూరీడు

'కబాసీ'ని కౌగలించుకుని
'బాలన్' అడుగుల్ని మృదువుగా స్పృశించి
గోదావరి ఎర్రటి రహదాగులన్నీ దాటి
నడిచి వచ్చావా వెన్నెలా!
అలసి వచ్చావా వెన్నెలా?
భయపడకు!
మా 'ప్రజాగాయకుడు' గొప్పుతూ కూడా
దిక్కులన్నింటికీ నిన్ను
"వెన్నెలో - ఎన్నెలా" అంటూ
మోసుకుపోతాడు.

[గద్దర్ ని గౌరవించాలని - అభిమానంతో]

జాలి మొగిలాలో....

—వర్గీస్

[పిల్లల పాట]

బైండ్లవాల్ల వాడల్ల లోనా ॥జాలిమొగిలాలో॥
బంతి పువ్వా లెన్నో పూసే ,,
బంతి పువ్వులు తెంపి గుచ్చి ,,
బంతూ లాటా ఆడుదామా ,,
మాల వాల్ల వాడల్ల లోనా ,,
మొగిలిపువ్వా లెన్నో పూసే ,,
మొగిలి పువ్వులు తెంపి గుచ్చి ,,
ముచ్చటలేమో ఆడుదామా ,,
బ్యాగరి వాల్లా వాడలల్లో ,,
బీరా పువ్వా లెన్నో పూసే ,,
బీరాపువ్వా లన్ని దెంపి ,,
బాటలలోనా పరుద్దామా ,,
మాదిగోల్లా వాడలల్లా ,,
మోదుగు పువ్వా లెన్నో పూసే ,,
మోదుగు పువ్వాలనేమో తెంపి ,,
మొగులు మీదీ కిసురుదామా ,,
దక్కలివాల్లా వాడలల్లో ,,
దాశన్న పువ్వు లెన్నో పూసే ,,
దాశన్న పువ్వులాను దెంపి ,,
దాగుడుమూతా లాడుదామా ,,
సిందోల్ల వాడల్లలోనా ,,
సన్నజాజూ లెన్నో పూసె ,,
సన్నజాజీ పూలు దెంపి ,,
సుక్కల మీది కిసురుదామా ,,
యానాది యిండ్లల్ల పొంటి ,,
వొడ్డి పువ్వు లెన్నో పూసే ,,
వొడ్డీ పువ్వాలన్ని దెంపి ,,

యెన్నెలల్లా వరుద్దామా ॥జాలి మొగిలాలో॥
లంబాడి తండల్లలోనా ,,
తంగేడి పువ్వు లెన్నొ పూసె ,,
తంగేడు పువ్వులన్ని తెంపి ,,
తారంగాలేమొ ఆడుదామ ,,
దండాసి వాడల్ల లోనా ,,
దోసా పువ్వూ లెన్నొ పూసే ,,
దోసాపువ్వూ లన్ని ఏరి ,,
దోరాజాలె కట్టుదామా ,,
రెల్లివాల్ల వాడాలోనా ,,
మల్లె పువ్వు లెన్నొ పూసే ,,
మల్లే పువ్వూలన్ని దెంపి ,,
ఇల్లిల్లు తిరిగి పంచుదామా ,,
సవర వాల్ల గూడాలలోనా ,,
సంపెంగ పువ్వు లెన్నొ పూసె ,,
సంపెంగ పువ్వులన్ని దెంపి ,,
సందమామ మీది కిసురుదామా ,,
గోడారి గూడాలలోనా ,,
గునక పువ్వూ లెన్నొ పూసే ,,
గునక పువ్వూలన్ని కోసి ,,
గుడిసేలా మీదికి ఏసేద్దామా ,,
చెంచువాల్ల గూడాలాలోన ,,
చెనిగె పువ్వూ లెన్నొ పూసే ,,
చెనిగి పువ్వూ లన్ని తెంపి ,,
చెట్టు దుంకు డాడుదామా ,,
గోండువాల్ల గూడాలలోనా ,,
ఎఱ్ఱగన్నేరు లేమో పూసె ,,
ఎఱ్ఱగన్నేరు లన్ని దెంపి ,,
ఎఱ్ఱజెండా మీది కేద్దామా ,,

మా ప్రపంచం

— హెచ్చార్కె

మా ప్రపంచం ప్రపంచమంత పెద్దది
ప్రపంచం కంటె పెద్దదీ కాదు
ప్రపంచం కంటె చిన్నదీ కాదు
మా ప్రపంచం ప్రపంచమంతే పెద్దది.

పసిఫిక్ సముద్రం లోతులు మాకు తెలుసు
ఎవరెస్టు శిఖరం ఎత్తులు కూడా తెలుసు
మేము సముద్రాల్ని యీది
ఖండాల మధ్య వంతెనలు కడతాం
మేము పర్వత శిఖరాగ్రాల నెక్కి
జనం జెండాలు ఎగరేస్తాం
కాని మా కాళ్ళు నేలమీదే వుంటాయి.
కళ్ళు పొద్దుపొడిచే చోటకు గురిచూస్తాయి.

ఈ ప్రపంచాన్ని దాని చెత్తాచెదారంతో సహా
మా కళ్ళల్లో పోసి జల్లించండి
భవిష్యత్తు మీద అనంతమైన ఆశ
మీకు ఎంచక్కా మిగులుతుంది
ఈ ప్రపంచాన్ని మా కాగితాలమీద గుమ్మరించండి
అది కవిత్వం పాదాలయి కూచుంటుంది
ఒక్కో పాదం మీద ప్రజలు తమ పాదాలు మోపుతూ
కొండ కొమ్మునెక్కి కొమ్ముబూరా లూదొచ్చు.

చిక్కుముళ్ళు పడిన జీవితాన్ని
మా పాశీలకు ఎక్కించి లాగండి
సూత్రాలు సూత్రాలుగా బయటికొస్తుంది.
దానితో దేవతా వస్త్రాలు నేయలేరు, గాని,
ప్రజాపోరాటాల విజయాల బెలూనులు ఎగరేయచ్చు.

"మీ" కు షార్టు సైటు
మీ నీడ తప్ప మరింకేం కనబడదు మీకు
మీ నీడను తప్ప మరిదేన్నీ ప్రేమించలేరు మీరు
మీ మీద మీ ప్రేమ మీకు కవిత్వమూ, అన్నీను.

మేము మా వ్యక్తిత్వాన్ని కూడా
ప్రజల వూర్ధ్వ గమనానికి
సోపానాలుగా చేస్తున్నామని కదా మీ బాధ.
మరి, ఓ కవీ! త్యాగమంటే ఏమిటి?
నీ కున్నదంతా యిచ్చుకోవడమే గదా.

మేను దైనమైట్లమే.
మరేం భయపడకండి, మేమొచ్చేశాం
మేము జానకి తాడు ముట్టించే వాళ్ళమే
మరేం భయపడకండి మే మొచ్చేశాం
అట్లా తిట్టకండి, గొణక్కుం దేడవకండి
మీకేం భయం లేదు.
మీ దంతమందిరాల చెరల్ని బద్దలు కొట్టి
మిమ్మల్ని కూడా విముక్తి చేస్తాం.

○○○ ○○○

చూశారా మా ప్రపంచ మెంత పెద్దదో
దీనిలో చివరికి మీరు కూడా వున్నారు.

ఇవాల్టి కివాళ మాత్రం
మా ప్రపంచం ప్రపంచమంత పెద్దది.

మరి, మీదో
ఉదాహరణకు, అది ఒక బావి కావచ్చు.

[ఒక ఇరానీ హోటల్ సాయంత్రంలో, వర్తమాన సాహిత్యం మాటీ తప్పుల మీద తుఫానైనవేళ, మిత్రుడు కె. శివారెడ్డి అన్నమాట యీ కవితకు మొదటి చరణమై, చర్విత చర్వణమైంది.]

13

నువ్వూ—నేనూ

—కె. రాంమోహన్ రాజు

ఒక్క క్షణం మరిచావా జీవితం
వాస్తవ మనే విషయాన్ని
మరుక్షణం ఊహల ఇంద్రధనస్సులు
పాతాళానికి జారుస్తాయి
ఒక్క క్షణం మరిచావా పోరాటం
నిత్యమనే సత్యాన్ని
మరుక్షణం బలహీనత ఆవహిస్తుంది
జీవితం నగ్నమవుతోంది
జీవితం పాశవిక మవుతోంది
జీవితం దుర్భర మవుతోంది
జీవితం కావాలి మనకు –
కాని ఈ జీవితం వద్దు
ఎక్కడ ఆశయాల ప్రదీప్తి కోసం
మేధస్సులు వికసిస్తాయో
ఆ జీవితం కావాలి
స్తబ్ధత వద్దు – తటస్థత వద్దు – పరాస్తత వద్దు
అందకుండా పరిగెత్తే కాలాశ్వపు
జూలు పట్టి దాన్ని
నీ అదుపులోకి తెచ్చుకో
కాలాన్ని నీ బానిసగా మార్చుకో
దాన్ని నీ వెంట తీసుకుపో
మోజెస్ సముద్రాన్ని రెండుముక్కలుగా చీల్చాడు
నువు అనంత కాలాన్ని రెండుగా విభజించు
ఒకటి భూతం – రెండు భవిష్యత్
వర్తమానంలో నువ్వు – నేను
అగ్నిని ఆరాధించే వర్గం మనది
పీడకవర్గ విధ్వంసం మనది

నూతన సృష్టి జరుగుతుందనే సూత్రం మనది
ఏక సూత్ర బద్ధులం మనం
కాలం కడలిలో
వర్గ పోరాటపు తుఫాను రూపుదిద్దుకుంటున్నది
ఇక్కడ —
ఈ బిందువు వద్ద మనం ఐక్యంగా నిలుద్దాం.

ఎర్రని చరిత్ర కోసం

—వుప్పల అప్పలరాజు

టేబుల్ మీద పేపర్లు
విశృలంగా వున్నాయి
అధికార మదంతో
హాయిగా నిద్రపోతోంది పేపర్ వెయిట్

ఉద్యమాల ఊపిరి పోసుకుని
ఉధృతంగా వీస్తుంది తూర్పుగాలి.

పేపర్లు తిరగబడ్డానికి ప్రయత్నిస్తున్నాయి
పేపర్ వెయిట్
భయంతో వణికిపోతోంది.

ఆ పక్కనే వున్న చోట్లల్లో....
మరికొద్ది పేపర్లో
చరిత్ర పుటల్లోకి
చిరస్థాయిగా పోయేందుకు
సిద్ధంగా వున్న సిరా
ఎర్రగా నవ్వుతోంది !

విప్లవకారులం

—రెడ్ వేవ్

ఆశయాల పునాదులతో
ఆచరణ కట్టడాన్ని కట్టాలనుకుంటే
విమర్శల వర్షం వచ్చింది
మహాపాధ్యాయుల సిద్ధాంతాలు
విమర్శల వర్షానికి గొడుగు పట్టాయి
మబ్బు తెరిపిచ్చింది
అనుభవాల ఇటుకలతో
ఆత్మవిమర్శల మెరుగులతో
త్యాగాల పూత పవితో
కష్టనష్టాల దర్వాజాలతో
పోరాటాల పైకప్పుతో
కమ్యూనిజం భవంతి కోసం
అహర్నిశలు శ్రమిస్తున్నాం.

జెండా సంరక్షకులు

1973 అగస్టు నెలలో అధిక ధరలకు వ్యతిరేకంగా వరంగల్ నగరం లోని అన్ని కార్మిక సంఘాలు ఒక ప్రదర్శన చేయాలనుకున్నాయి. ఆ ప్రదర్శనలో పాల్గొనే సంఘాలు తమ తమ యూనియన్ల జెండాలు కాకుండా కేవలం ఏ గుర్తూ లేని ఎర్రజెండాను మాత్రం తెచ్చుకోవచ్చని నిర్ణయం జరిగింది. ప్రదర్శకులందరూ వెయ్యి స్తంభాల గుడి (హనుమకొండ) దగ్గర సమావేశమై సుబేదారిలోవున్న కలెక్టరాఫీసు దాకా ఊరేగింపుగా వెళ్ళాలి. ఈ ప్రదర్శనలో తాముకూడ పాల్గొనాలని వి ర.సం, ప్రజాస్వామిక విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులు నిర్ణయించుకొని వెయ్యి స్తంభాల గుడిదగ్గరికి వెళ్ళారు. వరంగల్ నుంచి వచ్చిన ఐఎన్‌టియుసికి చెందిన కార్మికులు-ముఖ్యంగా వాళ్ళ నాయకుల చేతుల్లో కాంగ్రెస్ జెండాలు పట్టుకొని వచ్చారు. లెక్కబెడితే అవి 25 వున్నాయి. (1972 లో జరిగిన "భారత స్వాతంత్ర్య రజితోత్సవాల'కు అవి సింబాలిక్ అని వాళ్ళభావన. కాని స్వాతంత్ర్య జెండాకు కాంగ్రెస్ జెండాకు సంబంధంలేదని వాళ్ళకు తెలియదు.) వామపక్ష భావాలు గల విద్యార్థులు అందుకు అభ్యంతరం చెప్పారు. ఆ జెండాలు తొలగించాలని పట్టుబట్టారు. నిర్ణయం ప్రకారం ఎర్రజెండా కూడ లేని సి.పి.ఐ. (ఎం) నాయకులు విద్యార్థులు అభ్యంతర పెట్టినందుకు విద్యార్థులను మీరెవరి అనుమతితో వచ్చారని ప్రశ్నించారు. తమ ఊరేగింపులో పాల్గొనవద్దన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసారు. పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు విరసం వాళ్ళను వామపక్ష విద్యార్థులను మిగతా సంఘాల నుంచి వేరు చేసారు. అయితే ఎ.ఐ టి యుసి నాయకత్వంలో వున్న ఆర్.టి.సి., బ్యాంక్ ఉద్యోగుల సంఘాలు ఈ చర్యకు నిరసనగా విరసం వాళ్ళతో ఊరేగింపులో పాల్గొన్నాయి. పోలీసు నిర్బంధంలో ఊరేగింపు సాగింది. ఐఎన్‌టియుసి నాయకులు జెండాలుతీసి ఇద్దరు లాల్చీల జేబుల్లో పెట్టుకున్నారు. డి.ఐ జి. ఆఫీసు ముందుకు వెళ్ళేవరకు కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతో పోలీసులు విప్లవరచయితలపై, విద్యార్థులపై లాఠిచార్జ జరిపారు. కొందరికిబలమైన గాయాలు కూడ అయినవి. గాయపడిపడిపోయిన వారిని అరెస్టుచేసి పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయారు. ఇదంతాచేసి ఇల్లెక్కి అరిచినట్లు విప్లవరచయితలు, విద్యార్థులు తమ జెండాలను కాల బెట్టారని, జాతీయ పతాకాన్ని అవమానం చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. ఆ సాయంత్రం సభ ఏర్పాటు చేసి (విప్లవ విద్యార్థులపై, రచయితలపై లాఠీచార్జ్‌కు నిరసనగా అందులో ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వంలో వున్న బ్యాంకు ఉద్యోగుల సంఘం, ఆర్.టి.సి

ఉద్యోగులుకూడ పాల్గొనలేదు.) జెండాలు కాలబెట్టిన వారిపై చర్య తీసుకోవాలని దీర్ఘోపన్యాసాలు చేసారు. తగిన చర్య తీసుకోలేదని కలెక్టరును 'నక్సలైట్ కలెక్టర్' అన్నారు. బదిలీ చేయాలన్నారు. జిల్లాలోని 11 మంది ఎం.ఎల్.ఏలు హైదరాబాదులోవున్న రాష్ట్రపతికి ఫిర్యాదు చేసారు. తర్వాత కాలంలో విప్లవ రచయితలపై పెట్టిన కేసుల్లో వచ్చిన నిర్బంధాల్లో ఇది ఒక ముఖ్యమయిన సమస్యగా ముందుకు వచ్చింది.

ఇంతకూ జెండాలు జాతీయ జెండాలుకావు. కాంగ్రెస్ జెండాలు ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా తెచ్చినది. ఎందుకు తెచ్చారని విప్లవవాదులు అడిగారు తప్ప వాటిని కనీసం ముట్టుకోలేదు-కాల్చివేసారన్నది అభూతకల్పన కాని 'నక్సలైట్లు' జాతీయ పతాకాన్ని అవమానపరచారు అంటే, ఈ దేశంలో "దేశభక్తులు" నమ్మడానికి అభ్యంతరం ఏముంటుంది? దీనికి దాఖలాలు సాక్ష్యాలు కూడ అక్కర్లేదు.

2

1980 జనవరిలో అనుకుంటాను. కాకతీయ యూనివర్శిటీ క్యాంపస్‌లో రిపబ్లిక్‌డే జెండా ఎగిరింది. జెండా తాడును ఆర్.ఎస్.యు. పి.డి.ఎస్.యు విద్యార్థులు ముట్టుకున్నారట. కాదు. జెండాను దించారా లేదా దించడానికి ప్రయత్నించారు అని జ్ఞానశీలు ఐక్యతా ఆరోపణ. ఈ కేసు ఇంకా కోర్టులో విచారణ జరుగుతున్నది. కనుక వివరాలు రాయను. దాదాపు రెండు సంవత్సరాలు అరడజనుమంది విద్యార్థులపై జాతీయ పతాకాన్ని అవమానించారన్న నేరారోపణపై విచారణ జరుగుతున్నది. స్థానిక కాంగ్రెస్ నాయకులు మొదలుకొని స్థానిక మంత్రి దాకా ఈ విషయంపై తీవ్రమైన చర్య తీసుకోమన్నారు. జిల్లానుంచి ఎన్నికయిన బి.జె.పి. ఎం.ఎల్.ఎ. అసెంబ్లీలో కూడ ప్రస్తావించాడు. ముఖ్యమంత్రిగారు స్వయంగా నక్సలైట్ల కేంద్రంగా వర్ణించిన కాకతీయ యూనివర్శిటీలో జాతీయ పతాకానికి ఆర్.ఎస్.యు, పిడిఎస్‌యు. విద్యార్థులు అవమానం చేసారంటే నమ్మడానికి 'దేశభక్తుల'కు కళ్ళుకూడ వుండనక్కర్లేదు. నిజనిజాల విచారణతో పనిలేదు.

3

హనుమకొండ, వరంగల్ పట్టణాలలో చాల వాడల్లో నాలుగు బాటలు కలిసే చోట ఆ వాడలకు చెందిన ప్రజలు వేదికలు నిర్మించుకొని జెండా కర్రలు పాతుకున్నారు. ఈ సంప్రదాయం అగస్టు 15, 1947 నుంచీ వున్నది. ఇట్లా హనుమకొండలో సుప్రసిద్ధంగా కొత్తూరు జెండా కుమార్‌పల్లి జెండా మొదలయినవి వున్నాయి. ఎవరి ఇల్లు ఎక్కడ వున్నదని తెలుసుకోవాలన్నా ఈ వాడల్లో ఈ జెండాలను కేంద్రంగా చెప్పి చిరునామా చెప్పడం కూడ కద్దు. సహజంగానే ఈ వాడల్లో అగస్టు 15, జనవరి 26 లలో రిపబ్లిక్ జెండా ఎగురుతుండేది. గత పన్నెండు సంవత్సరాలుగా మునిసిపల్ ఎన్నికలు లేనందున ఆయా వాడల్లో ఈ జెండాలు ఎత్తే కార్యక్రమాలు వెనుక పట్టుపట్టాయి. సరిగ్గా ఈ పన్నెండు సంవత్స రాల నుంచే నక్సల్బరీ రైతాంగ పోరాట ప్రభావంతో విద్యార్థులు, యువజనులు విప్లవ భావాలవైపు ఆకర్షింపబడుతున్నారు. గతకొద్ది సంవత్సరాలుగా, ముఖ్యంగా ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత కుమారపల్లి ప్రాంతంలో రాడికల్స్ ప్రభావం పెరిగింది. ఆ మరునాడు కామ్రేడ్ జన్ను చిన్నాలు నాయకత్వంలో ఇక్కడి విద్యార్థులు, యువజనులు రాజకీయ చైతన్యం పొంది, గ్రంధాలయం పెట్టుకొని విప్లవ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఏ జెండా ఎగురకుండా బోసిగా వున్న కుమారపల్లి కూడలిలో గత మూడు సంవత్సరాలుగా మేడే జెండా ఎగురుతున్నది. అయితే ఈ జెండాను వాళ్ళు మేడే నాడు ఏగరేసేవారు. ఆగస్టు 15 వచ్చినా జనవరి 26 వచ్చినా ఆ జెండాను దించి రిపబ్లిక్ జెండాను ఎగరేయాలని కానీ, ఎవరూ ప్రయత్నించలేదు.

1981 మే 2, 3, తేదీల్లో వరంగల్‌లో ఆంధ్రప్రదేశ్ రాడికల్ యువ జన సంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. ముందుగా మేడే రోజు ఈ కుమార పల్లి కూడలిలో మేడే జెండా ఎగరేస్తారని అనుమానించి ఏప్రిల్ 29 నుంచే అక్కడ పోలీసు క్యాంపువేసారు. ఆ పరిసరాలలో జనంరాకుండా చెదరగొట్టారు. లాఠీచార్జ్ జరిపారు.

అయితే 1980 లో ఎగరేసిన మేడే జెండా ఎగురుతూనే వున్నది. ఆగస్టులో మునిసిపల్ ఎన్నికలు వచ్చాయి. వాడలో వున్న విద్యార్థులను, యువకులను అంద

రిపి అరెస్టు చేసారు. రోజులతరబడి పోలీసుస్టేషన్‌లలో చిత్రహింసలు పెట్టారు. జన్మ చిన్నాలు సంస్మరణతో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయంపై దాడిచేసి ఒక్క పుస్తకం కూడ లేకుండా ఎత్తుక పోయారు. చాపలు, బట్టలుకూడ పట్టుక పోయారు. లైబ్రరి నిర్వహిస్తున్న విద్యార్థిని అరెస్టు చేసారు.

మునిసిపల్ ఎన్నికలు అయిపోయాయి. రాడికల్స్ ఎన్నికలు బహిష్కరించారు. పి.పి.ఐ., సి.పి.యం. అభ్యర్థులపై కాంగ్రెస్ ఐ అభ్యర్థి గెలిచాడు. ఈ వాడకు చెందిన విద్యార్థులు, యువకులు విడుదల కాలేదు. పోలీసు స్టేషన్‌లలో జెయిళ్ళలో మ్రగ్గుతున్నారు. కొందరు అరెస్టులు తప్పించుకోవడానికి వాడనుంచి తప్పుకున్నారు అయినా ఆగస్టు 15న కుమార్‌పల్లి కూడలిలో ఏజెండా ఎగురుతుందోనన్నది, పోలీసులకు అనుమానంగానూ భయంగానూ వున్నది. ఎందుకంటే గెలిచిన కాంగ్రెస్ ఐ కౌన్సిలర్ చైర్మన్ ఎన్నికకోసం పెట్టినక్యాంపులో వున్నాడు. అందువల్ల ఆగస్టు 13 దొంగ రాత్రి ఒక వ్యాన్ నిండా కుమార్‌పల్లి కూడలికి పోలీసులు వచ్చారు జెండా కర్ర (చాల పెద్ద ఇనుప బొంగు) తో సహ వేదికను మొత్తం పోలీసులు స్వయంగా తవ్వేసారు. (బహుశా మొదటిసారి పోలీసులు గడ్డ పారలు పట్టుకొని ఒక శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.) వేదికను నేలమట్టం చేసారు. జెండా బొంగు తీసుకొని వెళ్ళిపోయారు. నాలుగు వైపుల ఇళ్ళలలోవున్న వాళ్ళు కిటికీలలోంచి ఈ దృశ్యాన్ని బిక్కు బిక్కు మంటూ చూసారు. ఈకూడలిలో ఒక మూలనున్న మిల్క్‌బూత్ కౌంటర్ దగ్గర వేకువ జామున వచ్చిన ఆ వాడ ప్రజలకు ఆ వేదికమీద పాలడబ్బాలు పెడితేసీసాలు తీసుకవెళ్ళేఅలవాటు. అక్కడ జెండాలేదు. వేదిక లేదు. ఒక మూలన మౌనసాక్ష్యంగా పాలసరఫరా కౌంటర్, అక్కడికి మారిన పాలడబ్బాలు, సీసాలు. ఇది ఆగస్టు 14 దృశ్యం.

ఆగస్టు 15 కూడ వచ్చింది, పోయింది.

జెండాలకు వేదికలంటూ వుంటే జెండాలుంటాయి. జెండా కర్ర వుంటే జెండా వుంటుంది. ఎవరికి బలముంది ఏ జెండా ఎత్తుకోదల్చుకున్నా ఒక స్థలము, ఒక వేదిక, ఒక కాలము, ఒక కర్ర వుండాలికదా ! తాడూ, బొంగరంలేకుండా నేల విడిచినసాము వుండదు లేదు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది. (హజార్డు)గా వుందని వేదికలు, జెండాకర్రలు తీసేసామన్నారు. అట్లా అంతటా తీసేస్తామనికూడఅన్నారు ఎస్పీ. చివరకుపోలీసు జీపుల ప్రయాణానికి పోలీసు వ్యానుల దొంగాటకుకాని అవరోధాలుగా పరిణమించినవి. జెండాలు. కనుక జెండాలు పీకేసారు పోలీసులు. పోలీసు యూనిఫా(ర)మ్ అధికారాన్ని తప్ప ఇంకే జెండా అధికారాన్నీ సహించలేనంత శక్తి మంతుల్ని చేసాం పోలీసుల్ని మనం. పోలీసులాఠీలను తప్ప జెండాకర్రలను గౌరవించలేనంత క్రమ శిక్షణను నేర్పాం పోలీసులకు మనం. తుపాకుల మీదే గురివున్న పోలీసులు కార్మిక కర్షకుల సుత్తి కొడవలిని సహిస్తారనుకోవటం అత్యాశ. అయితే సుత్తి-కొడవలి జెండానేకాదు, ప్రజలు ఏ జెండా ఎత్తుకోవడానికి కూడ వీలులేకుండా జెండాలను బాటల్లో కలిపేసారు పోలీసులు.

మరి "దేశభక్తులు" ప్రజలసంగతి ఎలావున్నా పతాకాలనైనా పట్టించుకునే నాయకులు ఏమంటారో !

4

తొమ్మిది నెలలు గడిచాయి. మానేరు నీరు కాకతీయ కాలువ ద్వారా వరంగల్‌లోకి ప్రవహించింది. (Much water has flown under the bridge) కాకతీయ యూనివర్శిటీలో విద్యార్థి సంఘంఎన్నికలలో మూడోసారికూడ లెఫ్ట్‌ఫ్రంట్ ఘనవిజయం సాధించింది. సరిగ్గా ఆ సమయానికి అంజయ్య మంత్రివర్గం పడిపోవడం 'అయ్యగారికి' (హయగ్రీవాచారికి) క్యాంపస్ మీద ఉన్నొక్క కన్నువేయడం సాధ్యంకాలేదు. దానితో ఎన్నికలు ప్రశాంతంగానేజరిగాయి. మంత్రి గారి ప్రోత్సాహంతో పోలీసుల అండదండలతో లెఫ్ట్‌ఫ్రంట్‌ను దెబ్బగొట్టి అయినా సానుభూతి సంపాదించాలని చూసిన మతవాద, మితవాదశక్తులు, ముఖ్యంగా ఎబివిపి ఓటమితో ఔదుగరిచాయి. ఆకసితో ఇంక మార్చి 7వ తేదీ క్యాంపస్ హాస్టల్‌పై కిరాయి గూండాలతో దాడిచేసి దొరికిన లెఫ్ట్‌ఫ్రంట్ విద్యార్థులను దారుణంగా కొట్టారు. హాస్టల్ నెత్తుటి మడుగయింది. నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు స్వయంగా వైస్ చాన్సలర్ ఆ దృశ్యాన్ని చూసి అవాక్కయ్యాడు. కాని ఎవరికి మీదా ఏ చర్యతీసుకోలేదు, గాయపడిన విద్యార్థులు, చూసినవిద్యార్థులు స్పష్టంగా ఎవరెవరు దాడి చేసారో చెప్పినా అధికారులు క్యాంపస్ చూసి పోయార

ముక్కుచే పరిష్కారంగా భావించారు. 144వ సెక్షన్ ఉల్లంఘించారని లెఫ్ట్ ఫ్రంట్ విద్యార్థులనే ఎందరినో అరెస్టు చేసారు. వరంగల్‌లో అన్ని కళాశాలలలో వామపక్షవిద్యార్థులను బెదరించడమో, దాడిచేయడమో, ఏదో ఒక కవ్వింపు చర్య ఎబివిపి కొనసాగిస్తూనే వున్నది. క్యాంపస్‌లోనూ, అన్ని విద్యాలయాలలోనూ శాంతి హామీ ఇవ్వడానికి తాము సిద్ధమని వామపక్ష విద్యార్థులు ఎన్ని మార్లో విజ్ఞప్తులు చేసారు. పోలీసుక్యాంపుఎత్తివేసి యూనివర్శిటీకాలేజిని తెరవాలనిడిమాండు చేసారు. రావణవరాలతో ఏప్రిల్ 12 న కె యు సి కాలేజీ తెరిచారు. ఏప్రిల్ 29 సాయంత్రం5.30గంటలవేళ హనుమకొండలోపోలీసుహెడ్‌క్వార్టర్స్‌పక్కనఎబివిపి ప్రముఖ కార్యకర్త జగన్‌మోహన్‌రెడ్డిని చంపేసారు. మే 1 నుంచి సెలవు మీద వెళ్తూ, సరిగ్గా ఆ సమయానికి పత్రికల వారితో వీడ్కోలు సమావేశంలో వున్న ఎస్పీగారు "ఇది రాడికల్స్ పని" అని వెంటనే అనేసాడు ఎబివిపి అదే అన్నది. అంతేకాదు, పోలీసులు, ఎబివిపి, బిజెపి, తదనుయాయులైన లాయర్లు, అందరుకూడ జగన్‌మోహన్‌రెడ్డి కె యు. సి జెండాకేసు (1980 జనవరి 26) లో ప్రధానసాక్షి గనుక ఆయనను హత్యచేసారని అప్పటికప్పుడు ఒక చక్కని కథ అల్లారు. అంటే హత్య చేసింది ఎవరో, ఎందుకు చేసారో కూడ అప్పటికప్పుడు తీర్పు ప్రకటించారు

అయితే 'దేశభక్తి' ని, జెండా సెంటిమెంటును, జాతీయపతాక ప్రతిష్ఠ కాపాడడానికి సత్యం చెప్పడానికి ప్రాణాలొడ్డాడనే 'షవశ్రీ'ని ఎక్స్‌ప్లాయిట్ చేసుకోవాలనుకున్నాక పోలీసులకు, మతవాదులకు ఇది కక్కలేని, మింగలేని సమస్య అయికూర్చున్నది. ఇద్దరూ దాచాలనుకుంటున్నది.— కె యు సి హాస్టల్‌పై మార్చి 8న ఎబివిపి కిరాయిగూండాలతో చేయించిన దారుణమైనదాడి- రక్తపాతం.క్యాంపస్ హాస్టల్ మెట్లపై చిందిన నెత్తురు దగ్గర బయల్దేరితేకాని, బాట దొరకదు. కాని అక్కడ బయల్దేరడమంటే, తీగ లాగితే డొంకంతా కదలడం. పైగా ఇంతకాలం అధికార పార్టీలు, పోలీసులు దాచిన ఎబివిపి హింసా దౌర్జన్యాలను విధిలేకవెలుగులోకి తేవడం అవుతుంది అదిగాక, అప్పనంగా కొండంత పెట్టుబడిగా పనికొచ్చే జెండా సెంటిమెంటుంది. దీన్ని వాడుకుంటే జాతీయ జెండా, ప్రతిష్ఠ, దేశభక్తి, వీటిని కాపాడడానికి ప్రాణాలొడ్డిన సాహసి, సత్యసంధుడు. కనుక జెండా వేదికలు నిర్మూలించి జెండాలతోసహా జెండాకర్రలు మాయం చేసిన పోలీసులకు అప్పటి నుంచీ ఇప్పటిదాకా అందుకు కనీసపు నిరసన తెలపని 'దేశభక్తుల'కు మళ్ళీ జెండా చేతినిండా పనిపెట్టింది.

—సాకి

చర్చా వ్యాసం :

మార్క్సిజం - నవ్యమానవవాదం

-త్రిపురనేని మధుసూదనరావు

తర్కం — గతితార్కిక తర్కం

"గతితర్క మన్నా మరే తర్కమన్నా భావాలకొక తర్కం ఉంటుంది. భౌతిక ద్రవ్యం అచేతనంలోనిది. దానికి తర్కం ఉండద మేమిటి ?" (రావిపూడి వెంకటాద్రి, మార్క్సిస్టు భౌతికవాదం, పేజీ 19)

"తర్కం వుండేది ఆలోచనకే", (అదే పుస్తకం పేజీ 20)

"గతి తర్కం కూడా ఒకవిధమైన తర్కమే. అయితే మార్క్సిస్టుల దృష్టిలో గతితర్కమే తర్కం" (అదే పుస్తకం, అదే పేజీ)

"అసలు భౌతిక గతితర్క మన్నదే వంధ్యాపుత్రుడు, గగనకుసుమం, శశవిషాణం మొదలైన వాటివలే స్వయంబాధితం. ఎందుకంటే తర్కం భావాలకి సంబంధించింది. భావాలు చైతన్యం లోనివి. భౌతిక ద్రవ్యం కేవలం అచేతనం. ఈ రెండింటినీ కలపటమంటే అహరారంభంతో నిశాముఖాన్ని జోడించడమే" (జి. వి. కృష్ణారావు, సాహితీ చైత్రరథం 132)

"ప్రమాణ శాస్త్రంలో అత్యంత ప్రధానమైన సూత్రాలు మూడున్నాయి. 1. పక్షం పక్షమే. ఉదాహరణకి వాదంలో గుర్రం అన్నప్పుడు. గుర్రమే కావాలి. 2. పక్షం ప్రతిపక్షం కాదు. ఉదాహరణకి ఆవు అంటామనుకోండి. అది ఆవు కానిది కారాదు. పక్ష ప్రతిపక్షాలలో ఒకటి మాత్రమే యథార్థమవుతుంది. కానీ రెండూ యథార్థం కాజాలవు. ఉదాహరణకి రజ్జు సర్పాలను తీసుకుందాం. ఒక వస్తువు రజ్జువన్నా కావాలి. అంతేకాని ఒకే వస్తువు రజ్జువూ సర్పమూ కాదు" (అదే పుస్తకం పేజీ 132)

"The basic error in the Philosophical thinking of the founders of dialectical materialism was to compound logic with Ontology". (M. N. Roy, Materialism, Page 200)

"గతి తార్కిక భౌతిక వాద స్థాపకుల తాత్త్విక చింతనలో ప్రధాన దోషం తర్కాన్ని అస్తిత్వ శాస్త్రంతో గందరగోళపరచడం."

ఈవిధంగా నవ్యమానవవాదులు భావాలకి తర్కం వుంటుంది కానీ భౌతిక ద్రవ్యానికి తర్కం వుండదనీ, మార్క్సిస్టులు గతితర్కాన్నే తర్కంగా భావిస్తారనీ, మార్క్సిస్టులకి తర్కం (Formal logic) తెలీదనీ, భౌతిక ద్రవ్యానికి తర్కం అనేది వుండదనీ, ఒక వస్తువు ఆ వస్తువే కావాలి కానీ ఏక సమ సమయంలో ఒక వస్తువు ఆ వస్తువుగా వుండటం, ఆ వస్తువుగా లేకపోవడం జరగదనీ, గతితార్కిక భౌతికవాదం లేదా గతితార్కిక తర్కంమీద విమర్శలు చేశారు. శంకరాచారి భంగిమలో గతితర్కం మిధ్య అని చప్పరించారు. గతి తర్కం కేవల తర్కాన్ని (Formal logic) నిరాకరించదు. దేశదేశాలలో ప్రాచీనయుగాలనుంచీ నేటివరకూ తత్వశాస్త్ర వైధానికంగా వున్న తర్కశాస్త్రాన్ని గతితర్కం తనలో లీనం చేసుకుంది.

"…… … formal logic may be expounded (although not in full) without a knowledge of dialectical logic, but the reverse is not possible" (Bela Fogarasi, Logic. Berlin. 1955 Page 261).

"గతి తర్క తార్కిక జ్ఞానం లేకుండా, కేవల తర్కాన్ని (పూర్తిగా కాకపోయినా) విశదం చెయ్యవచ్చు గాని, తర్క జ్ఞానం లేకుండా గతితర్క తర్కాన్ని విశదం చెయ్యడం సాధ్యం కాదు". అంటే గతితర్కం తర్కాన్ని నిరాకరించదు. దానిని తనలో ఇముడ్చుకొని సుసంపన్నం చేస్తుంది. ఆలోచనకి సంబంధించిన సూత్రాల్ని తర్కం అంటారు. ఆలోచనా రూపాల సముదాయం తర్కశాస్త్రం.

"Logic is the science not of External forms of thought, but of the laws of development of all material, natural, and spiritual things i. e. of the development of the entire concrete content of the world and of its Cognition, i. e. the sum - total, the conclusion of the History of

Knowledge of the world." (Lenin : Collected Works, Vol. 38, Page 92-93)

"తర్కం ఆలోచన బాహ్యరూపాలకి సంబంధించిన శాస్త్రం కాదు. పదార్థానికి, ప్రకృతికీ, తత్వానికి సంబంధించిన అభివృద్ధి సూత్రాల శాస్త్రం. అంటే ప్రపంచానికి సంబంధించిన మొత్తం నిర్దిష్ట వస్తువు అభివృద్ధికి, దాని సైద్ధాంతిక జ్ఞానానికి సంబధించిన అభివృద్ధి సూత్రాల శాస్త్రం. ప్రపంచ జ్ఞాన చరిత్ర సారాంశమూ, నిర్ధారణా అయిన అభివృద్ధి సూత్రాల శాస్త్రం".

కాబట్టి తర్కం అంటే కేవలం ఆలోచనల బాహ్యరూపాల శాస్త్రంకాదు. పదార్థం, ప్రకృతి, తత్వం వీటి అభివృద్ధి సూత్రాల శాస్త్రం. ప్రపంచ నిర్దిష్ట సారాంశానికి, ఆ సారాంశ జ్ఞానానికి సంబంధించిన అభివృద్ధి సూత్రాల శాస్త్రం. భౌతిక ద్రవ్యానికీ, ప్రకృతికి తత్వశాస్త్ర విషయాలకి కూడా తర్కం అన్వయిస్తుంది. భౌతిక ద్రవ్యమైనా, ప్రకృతి అయినా, తాత్త్వక భావాలయినా, నిరంతరం మారుతూనే వుంటాయి. అభివృద్ధి పొందుతూనే వుంటాయి. తార్కిక సూత్రాలు కూడా అభివృద్ధి పొందుతూనే వుంటాయి. అలా తర్కం అభివృద్ధి పొందకపోతే, భౌతిక ద్రవ్యంలో, ప్రకృతిలో, తత్వంలో అభివృద్ధినీ, చలనాన్నీ ప్రతిబింబించనూలేదు, ప్రతిపాదించనూలేదు. నిరంతరం మార్పుచెందే వాటిని మార్పు చెందని తార్కిక సూత్రాలు వివరించలేవు. ప్రపంచం అనిర్దిష్ట, అరూప విషయం కాదు. ప్రపంచ నిర్దిష్ట సారాంశం మొత్తం, దానిని సిద్ధాంతీకరించుకోవడం, అభివృద్ధి పొందుతూనే వుంటుంది. ఈ అభివృద్ధి నుంచి రూపొందే సూత్రాల సముదాయమే తర్కం. అందుకే తర్కం ప్రపంచ జ్ఞాన చరిత్రకి సంబంధించిన సంగ్రహ రూపమూ, నిర్ధారణా కూడా అవుతుంది. ప్రకృతికీ, సమాజానికి, చైతన్యానికి కూడా తర్కం వుంటుంది. ఇందులో దేనికి తర్కం లేకపోయినా మరొకదానికి తర్కం వుండదు. ప్రకృతి, సమాజం, చైతన్యం, అన్నీ వాటి స్వరూపాన్ని బట్టి అభివృద్ధి పొందుతూనే వుంటాయనేది అందరూ అంగీకరిస్తున్న విషయమే. అచేతన పదార్థం అంటే అభివృద్ధిపొందని, మార్పు చెందని చలనరహిత పదార్థమని అర్థం కాదు. అచేతనపదార్థానికి, చేతన పదార్థానికి అభివృద్ధి సూత్రాల్లో మార్పు వుంటుంది. తేడా వుంటుంది.'

"If every thing develops does not that apply also to the moral general concepts and categories of thought ? If not, it means that thinking is not connected with being. If it does, it means that there is a dialectics of concepts and a dialectics of cognition Which has objective significance". (Lenin : C W. 38, Page 56).

"ప్రతిదీ అభివృద్ధి పొందుతుంటే ఆలోచనకి సంబంధించిన అతి సాధారణ భావనలూ, ప్రత్యయాలూ అభివృద్ధి పొందవా ? అలా అభివృద్ధి పొందవు అంటే ఆలోచనకీ అస్తిత్వానికీ సంబంధం లేదనవలసివస్తుంది. అభివృద్ధి సూత్రం ఆలోచనల రూపాలకి అన్వయిస్తుం దనుకుంటే వస్తుగత ప్రాధాన్యత వున్న భావనల గతితర్కం, సిద్ధాంతీకరణ గతితర్కం వుంటాయని అర్థం చెప్పుకోవాలి"

అభివృద్ధి పొందే స్వభావం గల అన్నిటికీ గతితర్కం వుంటుంది. భావాలకి అస్తిత్వానికీ సంబంధాన్ని ఆమోదిస్తే, భావాలకి గతితర్కం వుంటుందనీ, భావనలకి ప్రత్యయాలకి అభివృద్ధి వుంటుందనీ చెప్పినట్టే. భావాల గతితర్కం ఆ భావాల వాస్తవ సామాజిక, ప్రాకృతిక మూలాలనుంచే వస్తుంది.

"The idea is nothing else than the material world reflected by the human mind and translated into forms of thought" (Marx : Capital)

"భావం, మనిషి మనస్సు. ప్రతిబింబించుకొని ఆలోచనా రూపాలుగా అనువదించుకునే భౌతిక ప్రపంచం తప్ప మరేమీ కాదు "

"The sole content of thinking is the world and the laws of thought." (Engels Anti-Duhring, Page 385)

"ప్రపంచం, ఆలోచనా సూత్రాలే, ఆలోచనలో ఏకైక వస్తువు".

"........ logical concepts are subjective as long as they remain abstract, in their abstract form, but at the same time they express also the things - in - themselves, Nature is

both concrete and abstract both phenomenon and essence, both moment and relation. Human concepts are subjective in their abstractness, separateness, but objective as a whole, in the process, in the sum - total, in the tendency, in the source". (Lenin ; Philosophical Note Books Page 208)

"తార్కిక భావనలు అనిర్దిష్టంగా వున్నంతకాలం, అనిర్దిష్టరూపంలో ఉన్నంతకాలం, వ్యక్తి నిష్ఠంగానే వుంటాయి. కానీ అవి అలా వుంటూనే వస్తువుల్ని వస్తువులుగా కూడా వ్యక్తం చేస్తాయి ప్రకృతి నిర్దిష్టం, అనిర్దిష్టం కూడా. దృగ్గోచరం, సారాంశం, చలనం, సంబంధం కూడా మానవ భావనలు అనిర్దిష్టతలోనూ, విడిగా వున్నప్పుడూ వ్యక్తి నిష్ఠాలే. కానీ ఒక క్రమంలో, ఒక మొత్తంలో ఒక ధోరణిలో, మూలంలో, సమిష్టిగా వస్తు నిష్ఠాలే."

భౌతిక ప్రపంచంతో నిమిత్తం లేకుండా, భౌతిక ప్రపంచంలో లేకుండా, ఆలోచనా రూపాల శాస్త్రమైన తర్కం భావాలకి ఎక్కడనుంచి వస్తుంది? ఆలోచన తార్కికరూపాన్ని పొందటానికి, ఆ ఆలోచనకి మూలమైన వాస్తవికతకి, సంబంధం లేదా? భావనలూ (Concepts) తీర్పులూ (Judgements) అనుమానాలు (Inferences) సిద్ధాంతాలూ (theory) వంటివి ఆలోచనారూపాలు. ఈ ఆలోచనా రూపాల్ని అధ్యయనం చేసేదాన్ని తర్కం అంటారు. ఆలోచనకి వేదికగా వుండే, విషయంగా (object) వుండే ప్రకృతీ, సమాజమూ, మెదడు యంత్రాంగమూ, ఆలోచనా, ఆలోచనా రూపాలూ, విభజించటానికి వీలులేనివి. అలా విభజించిచూస్తే తార్కిక రూపాలు పుట్టటానికి, కొత్త తార్కిక రూపాలు పరిణమించటానికీ కారణాల్ని వివరించలేం. ఆదిమ మానవుడికి లేని తార్కిక రూపాలు నాగరిక మానవుడికి వుండటానికి సామాజిక పురోగమనాన్ని తప్ప మరొక కారణాన్ని చెప్పలేం. మెదడు యంత్రాంగం, సామాజిక జీవితం లేకుండా తార్కిక రూపాలు వుండవు. భాష తర్కానికి వస్తువు. భాషకి సహజంగా వ్యాకరణం వున్నట్టే, భాషలో జరిగే ఆలోచనలకి తార్కిక రూపాలు వుంటాయి. తర్కం, శాస్త్రరూపాన్ని పొందినప్పుడే ఉపరితల అంశాలు అవుతాయి. సామాజిక సంస్థా రూపాన్ని పొందనిదానికి ఉపరితల అంశంగా పరిగణించే అర్హత రాదు. ప్రకృతికి వస్తుగత సూత్రాలు వున్నాయని నవ్యమానవవాదులు ఆమోదిస్తున్నారు.

ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనల్ని ఆమోదిస్తున్నారు. అలాంటప్పుడు అచేతన పదార్థానికి, భౌతిక ద్రవ్యానికి తర్కం వుండదనీ, భావాలకే ఆలోచనలకే తర్కం వుంటుందనీ చెప్పటం అశాస్త్రీయం కాదా? అచేతన పదార్థంలో సహజ వైరుధ్య తార్కికత లేకపోతే, దాన్నుంచి చేతనపదార్థం ఎలా ఆవిర్భవించింది? నవ్యమానవ వాదులు మనిషికి హేతువు ప్రకృతినుంచే సంక్రమించిం దంటున్నారు. ప్రకృతిలో లేని హేతుబద్ధత మనిషికి ఎలావచ్చింది?

"Every science is applied logic." (Leoin. C. W. 38. Page. 201.)

"ప్రతి విజ్ఞానశాస్త్రం అన్వయించబడిన తర్కమే." ఈ అన్వయం విజ్ఞాన శాస్త్రవిషయమైన భౌతిక ద్రవ్యంతో నిమిత్తం లేకుండా జరగదు. జ్ఞాతకీ (cognising subject) జ్ఞేయానికీ (Cognised obiect) మధ్య గతితార్కిక అన్యోన్య క్రియ లేకుండా సిద్ధాంతశాస్త్రం సాధ్యంకాదు. తర్కాన్ని శాస్త్రీకరించే క్రమంలో తార్కిక ప్రత్యయాలు (logical categories) అభివృద్ధి పొందుతాయి. శాశ్వతంగా ఇక ఇవే తార్కిక ప్రత్యయాలు అని శాసనం చేసుకొని చేతులు ముడుచుకొని కూర్చోడం తప్పు. ఇతర విషయాల్లాగా తార్కిక ప్రత్యయాలు కూడా మారుతుంటాయి అభివృద్ధి పొందుతుంటాయి.

తార్కిక పద్ధతులు (Formal logical methods) అనేకం వున్నాయి. (1) సామాన్య అనుమానపద్ధతి (Inductive method) ప్రత్యేకంనుంచి సామాన్యానికి పోయేపద్ధతి. అనేక ప్రత్యేక ప్రతిపాదనల్ని అధ్యయనంచేసి ఆ ప్రతిపాదనల్లోని సర్వవ్యాప్త లక్షణాలు ఆధారంగా సామాన్య ప్రతిపాదనల్ని చెయ్యడం. (2) ప్రత్యేక అనుమానపద్ధతి (Deductive method) సామాన్యాలనుంచీ ప్రత్యేకాలకి పోయేపద్ధతి. అనేక సామాన్య ప్రతిపాదనల్ని అధ్యయనం చేసి వాటి సామాన్యతని ఆధారంగా చేసుకొని ప్రత్యేక ప్రతిపాదనలు చెయ్యడం. ఈ రెండు పద్ధతుల్లో ఒకదాన్ని కానీ, రెండింటినీ కానీ, ఇతర తార్కిక పద్ధతులనుంచీ వేరుచేసి స్వతంత్ర ప్రతిపత్తిని స్థాపించకూడదు All - inductionists కానీ all - deductionists కానీ తార్కిక పిడివాదులు. వీళ్ళు సత్యాన్ని ఏక ముఖంగా, శకలమాత్రంగానే, చూడగలరు. ఈ రెండు పద్ధతుల్లోనూ inference (అనుమానం) వుంది. ఈ inference తార్కికంగా చాలా విలువైన విషయం.

Genetic inference అయితే పై రెండింటికంటే బలమైన తార్కిక సాధనంగా ఉపకరిస్తుంది. అను యోగి – ప్రతియోగి-సంయోగి వీటిని కూడా తార్కిక పద్ధతిలో (Formal logical method) లో ప్రత్యయాలుగా వుపయోగించుకోవచ్చు. ఈ త్రికాన్ని తార్కిక ప్రత్యయాలుగా వుపయోగించడానికి విశ్లేషణ, సంశ్లేషణల క్రమాన్నిగురించిన అవగాహన ఉండాలి. ఒక అనుభవంతో, ఒక ప్రత్యేకదశతో ప్రమేయంలో వుండే విభిన్న అంశాలమధ్య భేదక్రమాన్ని తెలుసుకోవడం విశ్లేషణ. దీనివల్ల అనుభవాన్నీ, దశనీ సులభంగా అవగాహన చేసుకోవచ్చును. విశ్లేషణా పద్ధతిని వాస్తవిక వాద తాత్వికులు ఆమోదించారు. అఖండవాద తాత్వికులు నిరాకరించారు. ఒక ప్రత్యేక అనుభవంలో, ఒక ప్రత్యేక దశలో వెదజల్లబడివుండే అంశాలమధ్య సంబంధాల్ని స్థాపించి ఒక నూతన ధోరణినీ, ఒక నూతన సత్యాన్నీ అవిష్కరించడం సమన్వయం. భావవాద తాత్వికులు సమన్వయాన్ని ఆరాధిస్తారు. కానీ విశ్లేషణ లేని సమన్వయం సంపూర్ణం కాదు. తార్కిక నిశ్చయవాదులు (Logical positivists) విశ్లేషణాపద్ధతినే ఏకైక తార్కిక పద్ధతిగా ఆమోదిస్తారు ఈ రెండు పద్ధతులూ అవసరమే. విశ్లేషణా, సమన్వయం లేకుండా, త్రికాన్ని తార్కిక ప్రత్యయంగా ప్రయోగించకూడదు ఈ రెండింటి కలయికవల్లా త్రికానికి తార్కిక ప్రతిష్ఠ ఏస్తుంది. induction deduction కీ Analysis, synthesis కీ పరస్పర సంబంధంమంది. ఇవేకాక తత్వశాస్త్రంలోనూ, విజ్ఞానం శాస్త్రంలోనూ అనుసరించే సామాన్య తార్కిక పద్ధతులు అనేకం వున్నాయి. గతి తర్కం తర్కాన్ని నిరాకరించదు. గతితర్క తర్కం తర్కంతో ఆగిపోదు.

గతితర్క తర్కం ఆలోచనారూపాల్ని ఐక్యంగా అవయవిగా అధ్యయనంచేస్తుంది సామాన్య తర్కం పరిమాణ, గుణ మార్పుల్నీ, వైరుధ్యాల్నీ, అభావం అభావం కావడాన్నీ నిరూపించలేదు. వస్తు, సద్రిష్టదృగంశాల్ని వివరించలేక వాక్యలీలా మాత్రంగా వుండిపోతుంది అందుకనే తర్కం (Formal Logic) అధిభౌతిక తర్కమే. భౌతిక ద్రవ్యం నుంచీ పదార్థ పునాది నుంచీ, సామాజిక భౌతికత నుంచీ భావాల్నీ ఆలోచనా రూపాల్నీ విడదీయడం వల్లా, భావాలకి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వడంవల్లా నవ్యమానవవాదులకి తర్కమేకానీ గతితర్క తర్కం అంతుపట్టదు. గతి తార్కిక తర్కాన్ని ఆమోదిస్తే నవ్యమానవవాద మహాసౌధం కూలిపోతుంది. గగనపథవిహారం నుంచీ కూలి పడతారు. అందుకనే నవ్యమానవవాదుల శుష్క తర్క లీలావినోదులు.

"Diacectical logic, in contrast to the old, merely formal logic, is not like the latter, content with enumerating the forms of motion of thought i. e. the various forms of Jugdment and conclusion and placing them side by side without any connection. On the contrary, it derives these forms out of one another, it makes one subordinate to another instead of putting them on an equal level, it develops the higher forms out of the lower" (Engels. Dialectics of Nature. Page. 231)

"గతి తార్కిక తర్కం, తర్కంలాగా ఆలోచనచలన రూపాలయిన తీర్పుకే నిర్ధారణకే సంబంధించిన విభిన్న రూపాల్ని వివరించడంతోనూ, ఏ సంబంధమూ లేకుండా ఒకదాని పక్కన మరొకదాన్ని పేర్చడంతోనూ సంతృప్తి చెందదు. గతితార్కిక తర్కం ఈ ఆలోచనా రూపాల్ని ఒకదాని నుంచీ మరొక దాన్ని ఉత్పత్తి చేస్తుంది. అన్నిటినీ సమాన స్థాయిలో నిలపడం కాక ఒక రూపానికి మరొక రూపాన్ని విధేయం చేస్తుంది. అల్ప రూపాలనుంచీ ఉన్నతరూపాల్ని అభివృద్ధి చేస్తుంది "

గతి తార్కిక తర్కం విభిన్న ఆలోచనా రూపాల మధ్య అన్యోన్య సంబంధాల్ని కల్పిస్తుంది. ఈ సంబంధం ద్వారా ఒక ఆలోచనా రూపం నుంచీ మరొక ఆలోచనా రూపం వుద్భవిస్తుంది. ఆలోచనా రూపాలలోని తారతమ్యాన్ని బట్టి ఒక రూపానికి మరొక రూపాన్ని విధేయం చేస్తుంది. అల్ప రూపాల నుంచీ ఉన్నత రూపాల్ని అభివృద్ధి చేస్తుందిసామాన్యతర్కానికిఈశక్తి లేదు అనిర్దిష్టంనుంచీ వీలైనంత నిర్దిష్ట భావనకి అధిరోహక్రమగతికి సంబంధించిననిర్మాణంగా ఆలోచనా రూపాల మొత్తం వ్యవస్థని అధ్యయనం చెయ్యడం గతితార్కిక తర్క సమస్యల్లో అతిముఖ్యమైన సమస్య ఇది అధిభౌతిక తర్కంద్వారా సాధ్యం కాదు. ఈ సమస్యని గతితార్కిక తర్కమే పరిష్కరించగలదు. గతితార్కిక తర్కం వస్తువుల్ని, క్రమాల్ని, భావాల్ని చారిత్రకంగానూ తార్కికంగానూ విశ్లేషిస్తుంది. కేవల తార్కిక పద్ధతి ఒక వస్తువు, ఒక భావం అస్తిత్వంలోకి రావడం, అస్తిత్వంలో వుండడం. అస్తిత్వంలో నుంచీ పోవడం అనే నిత్యపరివర్తనా స్థితిగతిని వివరించలేదు. కేవల చారిత్రక పద్ధతి వస్తువునీ, భావాన్నీ కాలానుక్రమపద్ధతిలో వివరించగలదే కాని, కారణాల్ని. అది [illegible] దశకీ [illegible] ఉండని దశకీ సంబంధాల్ని

వివరించలేదు. అందుచేత గతితార్కిక తర్కం చారిత్రకం, తార్కికం. మార్క్స్ 'పెట్టుబడి' వివరణని గురించి లెనిన్ ఇలా రాశాడు.

"A double analysis, deductive and inductive – logical and historical (forms of value)" (Lenin C.W. 38, Page 320)

"విలువ రూపాల్ని ప్రత్యేక, సామాన్య అనుమాన పద్ధతుల ద్వారా, తార్కిక చారిత్రక పద్ధతుల ద్వారా విశ్లేషించడం జరిగింది." అలాగే ఏంగిల్సు ఇలా అన్నాడు :

"With all the induction in the world we would never have got to the point of becoming clear about the process of induction. Only the analysis of this process could accomplish this." (Engels. Dialectics of Nature, Page 228)

"ప్రపంచంలో సామాన్య అనుమాన పద్ధతివల్ల ఆ పద్ధతి క్రమాన్ని స్పష్టం చేసుకోవటం సాధ్యం కాదు. ఈ క్రమాన్ని విశ్లేషించడం వల్ల మాత్రమే ఈ స్పష్టతని సాధించవచ్చును". కాబట్టి గతితార్కిక తర్కంలో deduction, induction, analysis, synthesis, logical, historical పద్ధతులు అన్నీ పరస్పరం అవిభాజ్యంగా ఒక అవయవిలో అవయవాలుగా ఉంటాయి.

"Modern Physics is in travail, it is giving birth to dialectical materialism". (Lenin : C. W. 14, Page 313)

"ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రసవవేదన పడుతోంది అది గతితార్కిక భౌతిక వాదాన్ని ప్రసవిస్తూ ఉంది."

పదార్థ జ్ఞానాన్ని (Physical Knowledge) వాస్తవంగా అస్తిత్వంలో వుండేదిగా పరిగణించి, దాని ఆవిర్భావ అభివృద్ధి దృక్కోణం నుంచి పరిశీలించ వలసివస్తే అప్పుడు సిద్ధాంతీకరణ సమస్యల్ని తర్కం పరిష్కరించలేదు. గతి తర్కమే అనివార్య శరణ్యం అవుతుంది. ఆధునిక పదార్థ విజ్ఞానశాస్త్రం గతి తార్కిక తర్క అవశ్యకతని నిరూపించింది. మైక్రోస్కోపుతో పరిశీలించి లేని పదార్థాంశాన్ని గతితార్కిక తర్కక్రమంతో ఊహించవచ్చును. కేవల తర్కానికి (Formal logic) ఈ శక్తిలేదు.

Matter అంటే భౌతిక ద్రవ్యం అని అది అచేతనమనీ అనుకోవడం, నవ్యమానవవాదుల జ్ఞానపరిమితులకి ప్రమాణంగా వుంది. నవ్యమానవ వాదులు భౌతికవాదులా కారా అనే చర్చ మరొక సందర్భంలో చెయ్యవచ్చును కానీ గతి తార్కిక భౌతికవాదుల దృష్టిలో పదార్థం అంటే ప్రత్యేకార్థం, సామాన్యార్థం కూడా వుంది. ఆయా శాస్త్రాల ప్రమేయం (subject - matter) బట్టి నిర్దిష్ట పదార్థ అధ్యయనం ఉంటుంది. మార్క్సుకి పూర్వం వుండిన భౌతికవాదులు matter or substance భౌతిక ద్రవ్యంగా మాత్రమే భావించారు. చారిత్రిక సంఘటనలు వ్యక్తుల సంకల్పబలంతోనే జరుగుతాయని అనుకున్నారు. గతితార్కిక భౌతికవాదం ప్రపంచ (అంటే ప్రకృతి, సమాజం, వాటిని గురించిన చైతన్యాల) భౌతిక ఐక్యతని ఆవిష్కరించింది. తత్వశాస్త్రంలో పదార్థం అంటే మన ఇష్టాయిష్టాల్తో నిమిత్తం లేకుండా, వస్తుగతంగా అస్తిత్వంలో వుంటూ, మన ఇంద్రియాదులద్వారా మెదడులో ప్రతిబింబించేది, అని అర్థం. వస్తుగత వాస్తవికత (objective reality) పదార్ధ సామాన్య, నిశ్చిత లక్షణం. వస్తుగతంగా అస్తిత్వంలో వుండడం (objectively existing), వస్తుగతంగా వాస్తవం (objectively real) 'అస్తిత్వంలో వున్నది' అనే దాన్తో సమానమైంది కాదు. అస్తిత్వం అనేది మనస్సులో కూడా ఉండే అవకాశం వుంది. మనస్సులో వుండే అస్తిత్వం భావ వాద అస్తిత్వ శాస్త్రానికి మూలం. వస్తుగత వాస్తవంగా వుండేదీ, మనస్సులో అస్తిత్వంలో వుండేదీ గతితార్కిక భౌతికవాద అస్తిత్వ శాస్త్రానికి మూలం. ఈ అర్థంలో 'being' అంటే ప్రకృతికి సంబంధించింది అయినా, సమాజానికి సంబంధించింది అయినా, మనిషిని అతని చైతన్యంతో, ఆలోచనల్తో కలిపే పరిశీలించడం జరుగుతుంది. ఆలోచన, చైతన్యం, జీవితం అవిభాజ్యంగాఉంటాయి గతి తార్కిక తర్కంలో అస్తిత్వశాస్త్రం (Ontology) తర్కం (Logic) జ్ఞాన సిద్ధాంతం (Epistemology) శబ్దార్థశాస్త్రం (Semantics) అవిభాజ్యంగా, అవయవాలో అవయవాలుగానే ఉంటాయి వీటిమధ్య తేడా సాపేక్షం. కాబట్టి గతి తార్కికతర్కం తర్కాన్ని జీవితానుభవంతో అనుభవీకరిస్తుంది. విడివిడిగా చూడదు. స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వదు. నవ్యమానవవాదులు అస్తిత్వశాస్త్రాన్నీ తర్కాన్నీ వేరుచేసి ఆలోచనారూపాలకీ, భావాలకీ స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించుకున్నారు దీనివల్ల భావాలు సామాజిక జీవితంలో నిర్వహించే పాత్రని మాటల్లో ఎక్కువగా అంచనావేసి ఆచరణలో ఏమీ లేకుండా చేశారు. దేన్నిగురించి అయినా

అప్పటికి ఉన్న జ్ఞానాన్ని జీవితానికి ఉపయోగించుకోవడం విస్మరించి ఆ జ్ఞానాన్ని ప్రశ్నించడమే మనిషి కర్తవ్యమని జీవితంలో జ్ఞానం పాత్రని నిరాకరించారు. కేవలం ప్రశ్నించడంతో, హేతువాదంతో జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం సాధ్యం కాదు. జీవితానికి అన్వయించుకొని, జీవితానికి ఉపయోగించడం ద్వారా అభివృద్ధిని సాధించాలి. జ్ఞానానికి ఆచరణని గీటురాయిగా గ్రహించకుండా, ప్రశ్నించడమే గీటురాయిగా పెట్టుకుంటే అది విశ్రాంతిపరుల విందుభోజనంలాగా వుంటుంది కానీ, జ్ఞానం జీవితాన్ని వెలిగించలేదు.

"Finally for me there could be no question of superimposing the laws of dialectics on nature but of discovering them in it and developing them from it" Engels Anti Duhring, Preface II, Page 13)

"ప్రకృతిలో ఏవో కొన్ని అంశాలకి మాత్రమే పట్టే గతితార్కిక సూత్రాల్ని మొత్తం ప్రకృతిమీద ఆరోపించే ప్రశ్న లేదు. ప్రకృతిలోని గతి తార్కిక సూత్రాల్ని ఆవిష్కరించి, ప్రకృతినుంచీ అభివృద్ధి చెయ్యాలి"

గతి తర్కం కానీ గతితర్క తర్కం కానీ ప్రకృతిమీద మార్క్సిస్టులు రుద్దరు. ప్రకృతిలోని వాటిని ఆవిష్కరించి ప్రకృతినుంచీ అభివృద్ధి చేస్తారు. గతితర్కం ప్రకృతి సమాజ చైతన్యాల సాధారణ అన్యోన్య సంబంధాల సూత్రాన్ని అధ్యయనం చేస్తుంది. గతి తార్కిక మూలసూత్రాల్ని ఆలోచనతో అన్వయించడం గతితార్కిక తర్కం అంటారు ఆలోచనల్లో ప్రతిబింబించే గతితర్కం వస్తుగత వాస్తవికతలో గతి తర్కమే. గతి తర్కం నుంచీ గతి తార్కిక తర్కాన్ని విడదీయలేం. అలా విడిగా చూస్తే గతితార్కిక తర్కం తర్క మాత్రంగా కనిపిస్తుంది భౌతిక ద్రవ్యాన్ని దానికి సంబంధించిన భావాల నుంచీ వివిక్తం (isolate) చేసి దానికి తర్కం వుండదన్ని చెప్పే నవ్యమానవ వాదుల అభిప్రాయం అతాత్త్వికమైందీ, అతార్కికమైందీ. జి. వి. కృష్ణారావు చెప్పిన వంధ్యాపుత్రాది మాటలకి వ్యంగార్థం ప్రధానం కానీ వాచ్యార్థంకాదు. శబ్దార్థ శాస్త్రానికి సామాజిక అస్తిత్వ శాస్త్రానికి (Semantics and materialistic Ontology) పరస్పర సంబంధం తెలీక వంధ్యాపుత్రాది (గొడ్రాలు కొడుకు) శబ్దాల్ని అర్థం నుంచీ విడదీసి జి. వి. కృష్ణారావు స్వయంబాధితాలని

భ్రమపడుతున్నాడు. వంధ్యాపుత్రాది శబ్దాలు కూడా వస్తుగతంగా వాస్తవాన్నే చెబుతున్నాయి. భాష, చిహ్నం (language and sign) వంటివి భాషాతత్వ శాస్త్రంలో సాధనాలుగా మాత్రమే కాక, అధ్యయన విషయాలు కావడం గతి తార్కిక తర్కం లేకుండా ఎలా సాధ్యం అవుతుంది ? తర్కం సాధారణ విష యాల్ని, బాహ్య ఆలోచనా రూపాల్ని దాటి వెళ్ళలేదని జి. వి. కృష్ణారావు ఉదా హరణలే స్పష్టం చేస్తున్నాయి. పక్షం పక్షమే అనేది శాస్త్రంలో నిలవదు. అఖండ పక్షం వుండదు. వాదాంశం లేకుండా పక్షాన్ని ప్రతిపాదించలేం. ప్రతి పక్షంలోనూ పూర్వపక్షాంశం ఉంటుంది లేకపోతే పక్షాన్ని ప్రతిపాదించడం సాధ్యంకాదు. దీనికి గుర్రాన్ని గాడిదనీ ఉదహరించడం తర్కశాస్త్ర విరుద్ధం. గుర్రం అనేది తార్కిక ప్రతిపాదనకాదు. ఇంతకీ గుర్రం అనేది గుర్రాలజాతిని అంతటినీ చెప్పే సమన్వయ పదం. గుర్రం వయస్సు ఎంత ? దాని ఆరోగ్యం ఎలావుంది ? అది రేసుగుర్రమా ? జట్కా గుర్రమా ? గుర్రాలజాతి ఎప్పుడు పరిణమించింది ? ఆధునిక సమాజంలో గుర్రాన్ని ఉపయోగించడంలో వచ్చిన మార్పులు ఏమిటి ? ఇలాంటి అనేక ప్రశ్నల్ని పక్షం ప్రతిపాదించడం లేదు గుర్రం అంటే గుర్రమే కావాలికానీ ఆవు కారాదు. పక్షప్రతిపక్షాల్లో ఒకటి మాత్రమే యధార్థం అనే తార్కిక సూత్రం కూడా తప్పు. అన్యోన్య సంబంధం లేని పక్ష ప్రతిపక్షాలు వుండవు. గుర్రాన్ని ఆవు, లేదా, గాడిద అనుకునే అవకాశం వుండొచ్చు కాని కొండ అని ఎవడూ అనుకోడు. సూత్రానికీ ఉదాహరణకీ సంబంధం వుండాలి. ఒక వస్తువు ఒకే సమయంలో ఆ వస్తువుగానూ ఆ వస్తువు కానిదిగానూ వుంటుందనే గతితర్క తర్కాన్ని ఇక్కడ ఖండిస్తున్నానని కృష్ణారావు సంబరపడి పోయాడు. ఇది తార్కిక వెకిలి తనం. ఒక వస్తువు రజ్జువన్నా కావాలి. సర్పం అన్నా కావాలి. అంతేకానీ ఒకే వస్తువు రజ్జువూ సర్పమూకాదు, అంటున్నాడు. ఈ తర్కంతో ఎలాఅన్నాళ్ళపండి తుడుగా బతికాడో తెలీదు. ఒకేవస్తువు ఆ వస్తువుగానూఅది కాకుండానూ వుంటుంది అంటే రజ్జు (తాడు) అనే వస్తువు రజ్జువుగానూ సర్పంగానూ వుంటుందని అర్థమా ? ఇలా మార్క్స్, ఎంగెల్సు లాంటి వాళ్ళురాయగలరా ? స్కూలు పిల్లలన్నా అనగలరా ? ప్రపంచంలో అన్నీ నిరంతరం చలనంలో వుంటాయనీ, అందుచేత ప్రతివస్తువూ ఇతర వస్తువుల్తో కలిసి పరివర్తనా శీలంగా వుంటుందనీ. ఒక వస్తువులో చలనం వల్ల వస్తుదశలూ, స్థితులూ మారుతుంటాయనీ, ఏ వస్తువూ ఆవస్తువుగానే అఖండంగా వుండవనీ, గతితర్కం చెపుతుంది. పాముకి అనేక దశలు

వున్నాయి. ఏ దశా మరొక దశలేకుండా వుండదు. దాని జీవితంలోని ఒక దశనే దాని మొత్తం జీవితంగా చెప్పడం అధిభౌతికం. ఒక దశనుంచి ఇంకొక దశకి సాగాలంటే ప్రతిదశలోనూ ఆ దశ లక్షణంలో రాబోయే దశ లక్షణం వుండాలి. వుంటుంది. కాబట్టి పక్ష, ప్రతిపక్షాలు ఒక దానితో ఒకటి ఏ మాత్రం సంబంధం లేని వివిక్త భూములు కావు. అలా సంబంధం లేకపోతే ఒకదాన్ని పక్షమనీ, మరొకదాన్ని ప్రతిపక్షం అనీ ఎలా అంటున్నాం ? ఇలా గతితర్కం మీద జి. వి. కృష్ణారావు విమర్శ అంతా అశాస్త్రీయమే కాక, అపాండిత్యద్యోతకంగా వుంది. ఈయనకి తర్కం రాకపోవడంవల్ల తత్వం జీర్ణం కాలేదు. రావిపూడి కృష్ణారావుని రాసుకున్నాడు. బూదికూడా రాల్లేదు. భౌతిక గతితర్కం అనేది స్వయం బాధితం కాదు. భౌతిక ద్రవ్యానికి తర్కమూ వుంటుంది, గతితార్కిక తర్కమూవుంటుంది. వస్తుగత పదార్థ లక్షణం అనే సామాన్యార్థంలో పదార్థానికి తర్కమూ, గతితార్కిక తర్కమూ, రెండూ వుంటాయి. తర్కం అధిభౌతికం కావడం చేత కొన్ని పరిమితులలోనే అది పని చేస్తుంది. తర్కం వైధానికంగా వున్నంత కాలం తత్వశాస్త్ర విజ్ఞాన శాస్త్రాలలో పౌరాణికాంశం, ఆధ్యాత్మిక మూఢవాదం, భావవాదం ప్రబలంగా కలిసివున్నాయి. గతితార్కిక తర్కం వైధానికంకాగానే తత్వశాస్త్రం భౌతికవాదం గానూ, శాస్త్రవిజ్ఞానం తత్వశాస్త్రానికి పునాదిగానూమారిపోయాయి. విజ్ఞానశాస్త్రాల్లో నిమిత్తంలేకుండా, వాటికి అతీతంగా తత్వశాస్త్రం అసాధ్యమైపోయింది. ప్రకృతిలో కానీ సమాజంలోకాని ప్రజల అచరణలో భ్రమలకి స్థానం లేకుండా పోయింది. గతితార్కిక తర్కానికి గతతర్కం నుంచీ, గతితర్కానికి భౌతిక వాదం నుంచీ స్వతంత్ర ప్రతిపత్తి లేదు, గతితర్కం వైధానికం (methodology) భౌతికవాదం ప్రాపంచిక దృక్పథం. వైధానికంలేని ప్రాపంచిక దృక్పథంకానీ, ప్రాపంచిక దృక్పథంలేని వైధానికంగాని దీనికి పనికిరావు.

"If our premises are correct and we apply the laws of thought correctly to them, the result must tally with reality; Just as a calculation in analytical geometry must tally with the geometrical construction although the two are entirely different methods, Unfortunately however tois is almost never the case, and if so, only in simple operations". (Engels. Anti- Durhing. 385)

"మన ప్రమేయాలు తప్పులు లేనివయితే ఆ ప్రమేయాలకి మనం ఆలోచనారూపాల సూత్రాల్ని సరిగ్గా అన్వయించినప్పుడు, ఫలితం వాస్తవంతో సమానంగా వుండాలి. విశ్లేషణాత్మక రేఖాగణితం రేఖాగణితంలో నిర్మాణం రెండూ పూర్తిగా భిన్నమైన పద్ధతులు అయినప్పటికీ విశ్లేషణాత్మక రేఖాగణితం లోని లెక్క రేఖాగణిత నిర్మాణంతో తప్పనిసరిగా సమానమై వుండాలి. కానీ ఇది ఇలాగే జరగడంలేదు. జరిగినా చిన్న విషయాల్లో మాత్రమే జరుగుతోంది."

ముందు మనం సరియైన ప్రమేయాల్తో ప్రారంభం అయితే, వాటికి ఆలోచనాసూత్రాలు - అంటే - తార్కికసూత్రాలు సరిగ్గా అన్వయించగలిగితే, వాస్తవాలకి సమానంగా వుండే ఫలితాల్ని సాధించగలం. పూర్తిగా విభిన్న పద్ధతుల్ని అనుసరించినా ఇది సాధించగలం. తర్కం భౌతికం కాదు, పక్షం పక్షమే గాని ప్రతిపక్షం కాదు అని ముందే ఒక అశాస్త్రీయ ప్రమేయాన్ని ఏర్పరచుకుంటే ఫలితాలు వాస్తవంతో పొసగవు. అధిభౌతిక ప్రమేయం (Premise) అధిభౌతిక ఫలితాల్నే ఇస్తుంది. చివరికి తర్కంద్వారా తర్కాన్ని సాధించవలసిందే కానీ వాస్తవాన్ని సమీపించలేరు. నవ్యమానవ వాదులకి తర్కంలేదు. వాళ్ళు ప్రకృతినీ సమాజాన్నీ చైతన్యాన్ని విభజించి, చైతన్యానికి మాత్రమే తర్కం వుంటుందని చర్చ ప్రారంభించడంవల్ల వాస్తవాన్ని చేరుకునే అవకాశాన్ని మూసుకున్నారు. ఇక ఎంత తలబాదుకున్నా తర్కవలయంలో గుండ్రంగా తిరగడం తప్ప ఏమీ చెయ్యలేని స్థితిలో పడ్డారు. తమ తార్కికలీలకి అడ్డు వచ్చేటప్పటికి, ఆలోచించ టానికి నిరాకరించి గతి తర్కాన్ని మిధ్యఅని చప్పరిస్తున్నారు. మిధ్య అనేదాన్ని ఆమోదించి ఇంకా హేతువాదం, మానవవాదం అనడం ఎందుకు?

ఈ చర్చవల్ల తేలిన సారాంశం ఏమిటి? నవ్యమానవవాదులకి శాస్త్రీయ, నిశ్చిత ప్రాపంచిక దృక్పథం లేదు. అందుచేత వైధానికం కూడా లేదు. నిజానికి వాళ్ళకి తర్కంతోకూడా పనిలేదు. మార్క్సిజాన్ని ఏదో ఒక పద్ధతిలో ఖండించడం ఒక్కటే ధ్యేయం కావటంవల్ల, నవ్యమానవవాదులు తార్కిక అగా ధత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోలేక, గతితార్కిక తర్కంతోపాటు తర్కాన్ని కూడా ఖండించారు.

గతి తార్కిక తర్కాన్నిగురించిన విషయాల్ని ఇలా క్రోడీకరించ వచ్చును. (1) గతితర్కం తర్కాన్ని నిరాకరించదు, తనలో జీర్ణం చేసుకుంటుంది.

(2) గతితార్కిక తర్కం పదార్థానికీ, ప్రకృతికీ, తత్వానికీ సంబంధించిన అన్ని విషయాలకీ అన్వయిస్తుంది. (3) ఆలోచనా రూపాల్ని అన్యోన్య సంబంధం కలవిగా పరిగణించి వాటిని అవయవిలో అవయవాలుగా అధ్యయనం చేస్తుంది. (4) అల్ప ఆలోచనారూపాలనుంచీ ఉన్నత ఆలోచనారూపాల్ని అభివృద్ధిచేస్తుంది. (5) అనిర్దిష్టంనుంచీ నిర్దిష్టానికి అధిరోహణ (ascent) క్రమగతిని సాధిస్తుంది. (6) ఒక ఆలోచనా రూపంనుంచీ మరొక ఆలోచనారూపాన్ని వుద్భవింపచేస్తుంది. (7) ఒక ఆలోచనారూపాన్ని మరొక ఆలోచనారూపానికి విధేయం చేస్తుంది. (8) గతితార్కిక తర్కం సైద్ధాంతిక గ్రహణ (Cognition) చలనానికి సంబంధించింది. (9) ఈ సైద్ధాంతిక గ్రహణ నిర్మాణాన్ని గతితార్కిక తర్కం మొత్తం ఆలోచనారూపాల వ్యవస్థనుంచీ, ఆ వ్యవస్థకి వున్న వస్తుగత వాస్తవికత దృక్కోణంనుంచీ అధ్యయనం చేస్తుంది. (10) తార్కిక, చారిత్రిక పద్ధతుల్ని సమ్మేళనం చేస్తుంది. (11) గతితార్కిక తర్కం గతితర్కానికి ప్రాణవాయువు. భౌతికవాద ప్రాపంచిక దృక్పథానికీ, తత్వశాస్త్రానికీ, విజ్ఞాన శాస్త్రానిక్కీ, పైధానికం. (12) ప్రకృతిని ఆలోచనా రూపాల్లోకి అనువదించుకోవడానికి గతితార్కిక తర్కం ఏకైక సాధనం. (13) గతితర్క తార్కిక ప్రత్యయాలు చలన శీల ప్రత్యయాలు. అవి నిశ్చితంగానూ స్థిరంగానూ ప్రతిపాదనల్ని ఆమోదయోగ్యం చేసేవిగానూ వుంటాయి. (14) అంతః ప్రేరణ (intution) ని కలిగించే బలమైన ఏకైక సాధనం.

గతితార్కిక తర్కం పదార్థానికీ, దాని చైతన్యానికీ సంబంధించింది. కేవలతర్కం ఆలోచనకీ, భావాలకీమాత్రమే సంబంధించింది.

బలిపీఠం

— రావిపాటి ఉమామహేష్

చట్టం ఆయుధంతో
కళ్ళు పొడుస్తుంది.
కాళ్ళు నరుకుతుంది
గుండెల్లోకి గుళ్ళు
 పేల్చుతుంది

అన్నా !
నే దిక్కు దున్నది
హత్యవసర పరిస్థితి.

కవి నేస్తానికి....

—జుగాష్ విలి

'మైనాలిసా పెదవులమీద తోక తెగిన బల్లి
ముద్దుల చప్పుడు' వింటూ, చూస్తూ
పెదాల నెందుకలా నాలుకతో తడుపుకొంటావు
'ఒంటరి పక్షిలా శూన్యంలో'
ఎన్నాళ్ళు వేలాడుతావు
స్మృతుల్ని మోయడానికి బాధపడే వాడివి
కవిగా ఎలా మిగులుతావు
అనుభూతుల్ని కావలించుకొని
ఆకాశంలో ఆడుకొన్నంతకాలం ఆడుకున్నాం
ఎవరూ సంపూర్ణ అజ్ఞానిగాని
సంపూర్ణ మేధావిగాని కాదన్నది నిజం
'కర్రను కొట్టిన దబ్బా మూతలా' కాకూడదు మనం
'మువ్వల రవళికోసం
విస్తృత మైదానాల్ని' వెతికే నీ కళ్ళతో
ఆదిలాబాద్ అడవులో ఎండుటాకుల మీదినుంచి
వినిపించే ప్రతిఘటనా పదఘట్టన వైపు చూడు
ఇంద్రవెల్లి ఆలాపన చేస్తున్న
అమాయక గోండుల రక్తగానంవైపు చూడు
గోదావరి రెండు ఒడ్డుల్ని ఏకం చేస్తూ
అలలు మోసుకెళ్తూ, మోసుకొస్తున్న సందేశ సంగీతంవైపు చూడు
నిజంగా
నిజంగానే నీ కళ్ళు హృదయాన్ని మోస్తుంటే
ఆ 'హృదయాన్ని మోస్తున్న' కళ్ళతో
ఆశయాలను మోస్తున్న
ఆయుధాలవైపు చూడు
కలాన్ని ఆయుధంగా మార్చిన
కవులవైపు చూడు.

సీరియల్ నవలిక

37

ఆడది అగ్నికణమైంది

[గత సంచిక తరువాయి]

జరిగిన కథ :

[బయ్యక్క గర్భిణీ అయిందని కూడా దయ దలవక, పూరపందులూ పూరకుక్కలూ వంటి దుర్మార్గులు నయాన్నో భయాన్నో ఆమెను అనుభవించాలనుకున్నారు గాని, ఆమె లొంగ లేదు. పికిలి యింటిలో రాత్రిపూట తలదాచుకుంటూ వచ్చింది. ఆ దుర్మార్గుల కోపం పికిలి తండ్రి వెంకటయ్య మీదికి మళ్ళింది. ఒక చీకటి రాత్రిపూట తన బాధలు వెళ్ళబోసుకుందామని బయ్యక్క యింటికివచ్చి కూచుని మాట్లాడుతూంటే, వాళ్ళిద్దరినీ కాళ్ళూ చేతులూ కట్టి తెల్లారాక పంచాతీ చేశారు. బయ్యక్కను పూరినుంచి వెళ్ళ గొట్టారు. బస్తీలో ఏ ఆదరువూ రక్షణా పోషణా లేకుండా బిచ్చ మెత్తి బతుకుతూ, దొంగతనంగా బొగ్గు మోస్తూన్న బయ్యక్కను ఒక తాగుబోతు తరుముకురాగా, దగ్గర్లో వున్న ఒక యింటిలో దూరింది. లోపలవున్న మనిషి దయజూపి వండుకోమని తన వడ కిచ్చాడు. జంకుతూ, కొంకుతూ బయ్యి పక్కమీద ఒరిగిపోయింది. ఆ తరవాత ....]

14

కండ్లు దెరిసెటాల్లకు గుడిసె కన్నాలల్ల నుంచి ఎండపొద కత్తుల దీర్గ ఏలాడుతంది. కాసేపు నేనేడున్ననో తెలిసిరాలే. అట్ల ఎటూ తోసకనే అవులిచ్చు కుంట తలుపు దిక్కుసూసిన – తలుపు దగ్గరేసున్నది. ఇల్లంతా సదిరిపెట్టున్నది... చేసి నిలుసున్న.... గప్పుడు యాదికచ్చింది.... సీరె సదురుకొనుకుంట నా దిక్కు

అల్లం రాజయ్య

సూసుకున్న.... దయ్యం తీరుగనే ఉన్ననుకున్న- 'ఏడికి బోయిందో' అనుకుంట తలుపు దీసిన.... నీల్లకుండల నీళ్ళు నిండున్నయి. కుండ పాటుకు చిన్న గలేటు గిన్నెల సగం బువ్వున్నది. కూరున్న జాడలేదు.... ఎటు బోయిందో.

ఇగత్తడు పోత, అగత్తడు పోత నసుకుంటనే, అంబటేల్ల దనుక ఇంట్లకు బయటకు దిరిగిన.... అంబటేల్ల దాటిపోయింది. మరింక రాదేమోనని పక్కమీదనే కూకున్న.... పట్టపగలయ్యింది.... రానేలేదు.... తాళమన్నా ఏసి పోదామనుకొని ఇల్లంత సూసిన.... ఓ మొలకు తాళమున్నది.... తాళపుసెయ్యి ఎవల కియ్యాలె? అట్లనుకుంటనే పక్కమీది కొరిగిన - కండ్లు తలుపు దిక్కు బెట్టిన ...

ఎంతకు రాదు.... ఎటూ తోసక ఇల్లంత మల్లమల్ల జూసిన, గుడిసెల బాగా ఎలుగుపడే జాగల నాలుగు బొమ్మలున్నయి. ఒకతను తెల్లగడ్డం.... మనిషి ఏ రంధి రవుసు లేనోనితీరుగున్నడు. అయినె పక్క బొమ్మ పిల్లిగడ్డ పతను. పెదువుల మోటుగ దొడ్డు గుంటి తిడుతన్నట్టు గున్నది.... అతనిపక్క ఇంకో పిల్లి గడ్డం.... గీ మనిషి కండ్లు లావు జిత్తులమారిగున్నయి - నాలగో అతను ముద్ద సెంపలు - సీమకండ్లు - ఎడ్ల బొటతీర్గ నెత్తిమీద బట్టతల.... కుడి సెంపకింద గవ్వంత ఉలిపిరికాయ. గిసోంటి మనుషుల నేనెప్పుడు సూసినట్టు యాదికి లేదు. అదే గోడమీద జాజుతోటి కొడలి, మద్దెన సుత్తె ఉన్నయి. ఇంకొంచెం కింద మాసిన లాగు అంగి ఏలాడ్తన్నయి- లాగుమీద బొగ్గ టోపి.

ఇతనికి పెండ్లాం పిల్లలు లేరా? ఎటు పోయినట్టు? ఎంతకు రాదేం? ముక్కు మొకం తెలియని దానిమీద ఇల్లిడ్సిపెట్టి పోయిందు గదా? లేసి కూకున్న- తలుపు కొద్దిగ తెరిసిన - దూరంగ పట్నం తుమ్మసెట్లు - అడ పందులు గురుకూ గురుకు మనుకుంట కొట్లాడు కుంటన్నయి....

ఆకలి కాగలేక ఎట్లయితె గట్లయితదని ఉన్న బువ్వ తినేసిన.... తిన్నంక ఎన్నో అనుమానాలు.... మల్ల పక్కమీద ఒరిగిన.... కన్నంటు కున్నది....

మళ్ళ కండ్లు దెరిసేటాల్లకు సీకటయ్యింది.... అరరె! ఎంత వస్తై పోయిందని దిగ్గున లేసిన.... అగ్గిపెట్టె ఎతికి దీపం ముట్టిచ్చిన....

దీపాన్ని సూసుకుంట కూకున్న.... గీరాత్రి గడిత్తె తెల్లారి ఏదో సెయ్యాలనుకున్న....

తలుపు మూసి పక్కమీద పడి నిదుర బోయిన....

నేను మంచి నిదుర ఉండంగ తలుపుమీద దబడ దిబడ సప్పుడు.... లేసి కూకున్న... తలుపు సప్పుడు అట్లనే అయితంది... "ఏవలూ" అందామను కున్న.... అనుకుంటనే దీపం బట్టుకపోయి తలుపు దీసిన.... అతగాడు సుడిగాలి తీర్గ గుడిసెల కచ్చిండు.... నేను కొయ్యబారిపోయిన –

అతని నొసలు నుంచి నెత్తురు కార్తంది – బట్టలు సినిగన్నయి. మొక మంతా దుబ్బకొట్టుకపోయున్నది. నన్నె మడుగకుంటనే పక్కమీద ఒరిగిపోయిండు మాట గీట ఏది లేకుండనే మూలుగుతండు....

గిప్పుడు నేనేం జెయ్యాల్నో తోసలే.... సానాసేపు దీపం బట్టుకొని సూసుకుంట విలుసున్న –

కాసేపటికి తేరుకొని తడిగుడ్డతోటి నొసలు నెత్తురు తుడిసిన– మూలుగు తనే ఉన్నడు. దెబ్బలు గొట్టింది ఒక్కలు కానట్టున్నది. (గదెబ్బలు సేతులతోటో, కట్టెలతోటో గాక మరి దేనితోనో కొట్టినట్టున్నది.... అంగిడిసిన.... పెయ్యంత పెద్ద కొత్త సందులేటంట పికిలి పోయున్నది. నెత్తులు గలుసుు.... నెత్తురంత తుడిసిన –

గిప్పుడేం సెయ్యాలే – కండ్లు తెరిత్తె బాగుండు. మూలుగుడు బంద యితె మంచిగుండు... ఏడికన్నా తీసుకపోయి మందో మాకో రాత్తే బాగుండు. ఎవలు గొట్టిండ్లు ? ఎందుకు గొట్టిండ్లు ?

ఏడనో కుక్కలు మొరుగుతున్నయి. సుట్టుపక్కలోల్లెవల్నన్న పిలిత్త బాగుండు.... తలుపు దగ్గెరికి బోయి ఆగిపోయిన –

ఏమని చెప్పాలె ?.... నువ్వెవలంటె ఏం జెప్పాలె ? అసలు సెప్పనోల్న అద్దో ? మళ్ళీ ఎనక్కచ్చి దీపం దగ్గెర కూకున్న....

ఇంతట్ల తలుపు దగ్గెర సప్పుడు.... నేను అటుసూసెటాల్లకే బక్క గున్నతడు లోపటికచ్చిండు. మొకంల బొక్కలు తప్ప కండ లేనేలేదు. సేతుల తోలు సందున్నది....

నన్నుసూసి కండ్లు పుల బొడిసి

"అక్కా ఇప్పుడెట్లున్నది ?"

నేను గపిలుపివి ఉలికిపడ్డ.... గమాట నా గుండెల మళ్ళా మళ్ళా ఇన పడ్డది.... మళ్ళా గదే మాటన్నాడు. నేను ఇనిపిచ్చుకోలే- ఆతగాడు వంగి సూసిండు.

నేను తేరుకొని "దెబ్బలు బగ్గ తాకినయ్.... ఎటన్నా తీసుకుపోతే బాగుంటుంది." అన్న గపటో నాకు తెలవది.

"హఠాత్తుగ దాడి సేపిండ్లు- మరేం పర్వాలేదు. మీరు దైర్యంగా ఉండాలె.... బతుకు సొంతం నెత్తురు మయమే కదా!" ఎటో చూసుకుంట కలల మాట్లాడినట్టు మాట్లాడి ... అతని ఒళ్ళంతా తడిమిండు. లేచి విలబడి- "ఓ గంట లోవల డాక్టరొ స్తడు...." అనుకుంట ఎట్లా వచ్చినోడు గట్లనే పోయిండు.

"ఆటు ... జాగ్రత్త .. మేం తలుసుకుంటే ... కార్మిక శక్తి ... జిందాబాద్...." అంతూపొంతూలేకుంట అతను కలువరిత్తండు....

నాకు ఒక్క మాటన్నా తెలవలేదు .. తడిగుడ్డతోని తుడుసుకుంట కూకున్న.... ఎంతసేపయ్యిందో ? డాక్టరచ్చిండు. [77]గిలేటు చెంగులో పీళ్ళు వెచ్చజేసి యిమ్మన్నడు. ఇచ్చిన. అతను కట్లుగట్టి సూదిచ్చి మందు బిళ్ళలిచ్చి ఎప్పుడెప్పుడేయాల్నో సెప్పిండు.... "మళ్ళీ రేపొస్త.... మరేం వర్వాలేదు".... డాక్టరు పోయిండు. డాక్టరు పోయినంక మొదుగాలచ్చినాయినె మళ్ళచ్చిండు.

తెల్లందాక నాకు సెప్పుతన్నట్టుగనో తనండ్ల తనే గులుక్కున్నట్టుగనో ఏది తెలువకుంట ఏందో సెప్పుకచ్చిండు- గీ మాటలన్ని కొత్తయి.... నేను ఏం మాట్లాడకకుంట కూకున్న.... తెల్లర్తాదనంగా అతను ఎల్లిపోయిండు.

మందులు పన్జేసినట్టున్నయి. అతను సుకంగ పన్నడు. సప్పుడు గాకుంట ఇల్లూడ్సిన- గిన్నెలు కడిగిన- విల్లకోసం [78]నల్ల దగ్గెరకు బోయిన.... ఆడోల్లు కిందామీదా సూసిండ్లు-అడ కుక్కల కొట్లాట- సడీ సప్పుడులేకుంట అందరు బట్టు కున్నంక నేను బట్టుకున్న....

కక్కబద్ద తీర్గున్న ఒకామె- "ఏం గావాలె ?" అన్నది....

నాకు ఆ మాట తెలువక బిక్కమొకంతోటి విలుసున్న....

---

77. అల్యుమినియం. 78 వంపు

"గదేబిడ్డా ఏమైతవు?"... అన్నది ఓ మచ్చల మొకం దొడ్డ మనిషి....

ఏం జెప్పానో తోసలే.... ఏదో ఒకటి సెప్పాలెగన్క "సెల్లెను" అన్న.....

"అట్లనా ? ఎన్నో నెల?".... ఇందాకటామె.

ఇంకెవలో "ఏన్నో కాన్పన్న"రు మందిలనుంచి.

మాట్లాడకుంట నీల్లు బట్టుకున్న.

"బిడ్డా ! నువ్వేం ఫికరు పడకు, మేమంత లేమా ?" అన్నది దొడ్డామె....

అతని గురించి సెప్పాలనుకున్న.... పెప్పనో అద్దో ! కుండెత్తుకొని గుడిసెల కిచ్చేటాల్లకు గుడిసెవిండా మాసిన బట్టలోల్లు బొక్కటోపీలోల్లు సానా మందున్నరు.... అళ్ళంత ఎవల్నో తిడుతండ్లు, పండ్లుకొరుకుతండ్లు నేను అళ్ళ తిట్లు ఇనుకుంటనే నాలుగుకుండల నీళ్ళుతెచ్చిన-అప్పటికి ఆడమీది ఆడోల్లంతాగుడిసె ముంగట పేరిపోయిండ్లు-ఆడోల్లు సేతులు తిప్పుకుంట శాపనార్థాలు బెడుతండ్లు ...

ఎవలో "గాలి ఆడనియ్యండ్లె హం ! గీడ మాతిడుతరు. యాలక త్తె మోబ బడితె ఏదోడాద తోక ముడుత్తరు" అన్నదో ముసలోడు ..

"ఏవలురా ముసలినాకొడుక తోక ముడిసేది ?.... విండనియ్యి పాపం, బరుపూర నిండనియ్యి - గప్పుడు బత్తి అంటుకుంటది...." అన్నడు ఓ పొట్టోడు ...

అతను మద్దెన కూకుండి అందరికి ఏందో సెప్పిండు.... అట్ల తిట్టి, పండ్లు గొరికి ఎటోల్లటు ఎల్లిపోయిండ్లు... కొంతమంది పండ్లు గొనుక్కచ్చిచ్చి పోయిండ్లు-

గుడిసె బయట పాత తట్టలతోని కూసంతసాటు గట్టున్నది. నీల్లను పూసెటాల్లకు నాకు పానం లేసచ్చింది. సన్నీల్లతోటి తలకు బోసుకున్న.... బట్టల కింద పాద్దోతి దొరికింది. గది కట్టుకున్న-రయికె పిండుకొని తడిదే తొడుక్కున్న.

నేనిదంత పేసెటాల్లకు అతను మళ్ళి నిదురబోయిండు.... మళ్ళి నాసీరె సిరుగులు కన్పియ్యకుంట సరిపేసి కట్టుకున్న-

పగటించి లేసింది.

"నీ వొంట్లె గిప్పుడెట్లున్నది." అడుగాలనుకున్న.

అతను మళ్ళీ కండ్లుమూసుకున్నడు.

"నేను పోత". గులుగుతన్నట్టుగ అన్న.

"మీకు శ్రమ గల్గించిన-మన్నించాలె"- అతను లేసి కూకున్నాడు.

నేను మాట్లాడలే....

"ఇందాక ఈడకచ్చి పోయిన ముసలాయినె బయటెక్కన్నో ఉంటడు. మిమ్ముల మీ యింటికాడ దించత్తడు—— నేను బిలుత్త సన్ననని పిలువగలరా ?"

నేను బయట కచ్చినిలుసున్న- నేనేం జెప్పాలె। ఏడనాయిల్లని సెప్పాలె ఏ ఊరు తరిమికొట్టిందని సెప్పాలె ? గింత పీకులాటెందుకు ? నాకెవలతోదద్దని సెప్పిపోతె కాదా ?

లోపటికచ్చిన-నోరుపెకులలేదు.

"ఎవలు కన్పించ లేదా ?"

"నేనుమాపోత ...." నేనుఎనుకకుదిరిగిబయటకు నడిసిన.తూర్పుదిక్కున సూరీని సుట్టు వరద గూడేసింది. బయట వందదిగున్నది. నేను అడుగేయబోయిన లోపలినుంచి పిలిసినట్టనిపిచ్చింది. పోవాల్నా అద్దా అనుకుంటనే మళ్ళ గుడిసె లోపటికచ్చిన-

"మన్నించాలె- మీపేరడుగనేలేదు."

ఇందుకా పిలిసింది !

"పోనీ ఒదిలేయండి."

నాకండ్లల్ల నీళ్ళు సిమ్మకత్తన్నయి. పెదువులు అదురుతన్నయి.... గట్లనే ఉరుకుతే మంచిగుండు.

"మీరు నిన్ననే పోవాల్సింది. మీకోసం మీవాళ్లెవలు ఎతుక్కుంట రాలేదా ?"

గీ ముసుగుల గుద్దులాటెందుకు ? ఉన్న సంగతి సెప్పకుంటె నాకు పోయేదేమున్నది ?

"సరే ! నాకోసం ఎవలన్న అచ్చిండ్లా ?"

నేను సెప్పిన....

"ఆళ్ళ గురించి యిక్కడా అనద్దు....."

నేను ఒకడుగు గడుపావలేసి కలల మాట్లాడ్తన్న దానితీర్గ "నేను గీ లోకంలబిచ్చగాళ్ళ దాంట్లఒకదాన్ని– నాయిల్లు బస్టాండు, బంగుళల పంచలు, నా పని బొగ్గెత్తు కచ్చి అమ్ముడు హోటల్ల బాసండ్లు కడుగుడు...."

అతనిదిక్కు సూడకుంట రెండో అడుగు బయటేసిన–

"మీ పేరు సెప్పలేదు...."

"బయ్యక్క....గని....గపేరెప్పుడో పెద్దాల్లె గలిసిపోయింది"

"బయ్యక్కా.... నేను గందట్లనుంచే వచ్చినవాన్ని...."

అతనిమాటినకుంటనే ముందుకు నడిచిన...

"అరరే ! ఎటో పోతండ్లు ఏమన్నా కావాలంటే ఎవరి నడిగిన తెచ్చి పెడుతరు. అతన్ని సూసుకుంటుండాలె–" రాత్రి వచ్చిన బక్కతను సనువుగ నా సెయ్యిబట్టుకొని గుడిసెలకు తీసుకచ్చింది. నేను ఏది మాట్లాడకుంటనే మరిన్ని పనులు సెప్పింది.

నేను ఎటుతోసక నిలుచున్న.

నేను ఆడ ఉన్నట్టుగ మరిసిపోయి వాళ్ళిద్దరు మాటల్ల పడిపోయిండ్లు గమాటలు ఎంతకు ఒడువలేదు. అతను సెప్పిన పనులుపేసి పెట్టిన మళ్ళ నాత్ర య్యింది. డాక్టరు పండ్లు గొనుక్కచ్చింది. మళ్ళా ముగ్గురు మాటల్లపడిపోయిండ్లు. మద్దెల మరో పిలగాడచ్చింది. అతను ఎర్ర కాయిదం తీసి మొకం మీద నెత్తురు పేరంగ తీసి సదువ బట్టింది. ముగ్గురు వుండుండి తలలూపుకుంట ఇన్నరు. గందట్ల గితనిపేరు రాజారామని. అతగాన్ని మరెందుకో మరెవరో కొట్టిండ్లని తెలుసుకున్న. గనాత్రి సానామంది అచ్చిపోయిండ్లు.

నాత్రి సానాగడిసిపోయింది..... అందరెల్లిపోయినంత మోకాళ్ళమీద గద్దువబెట్టుకొని కూకున్న–

"ఏదన్న చెప్పండ్లి–అంట."

నేనేమి మాట్లాడలే– పోనీ ఏదో ఒకటి మాట్లాడ్త ? నాకు ఎరుకలేని కొట్లాట సంగతడిగిన– అతను సిన్నపిల్లకు సెప్పినట్టు సెప్పుకచ్చిండు. మాటల్ల మాటల్ల నే మా ఊరి సంగతుల గురించి, మనుషుల గురించి సెప్పుకచ్చిన– నేను చెప్పిన సంగతులన్ని ఇని –

''నేను సెప్పేమాటలన్ని తీకాసుగున్నయా ? మనందరం కనీసం మనుషులుగా బతకడం కోసం పెనుగులాడ్తన్నం.... ఈడికచ్చినోల్లందరియి గిసొంటి కన్నీటి బతుకులే– ఎవలను కదిలిచ్చినా గిసొంటి మాటలు కోకొల్లలు... మీరేమనుకోకుంటే మీకు నచ్చినంత కాలం ఈడనే ఉండచ్చు. ఎప్పుడు పోవాలనుకున్నా పోవచ్చు'' అన్నడు...

నేను పోతాననలేదు. పోనూ అనలేదు. నా మనుసుల ఆశ– వీళ్ళంతా నా బతుకుల ఎదురైన మనుషుల తీర్గలేరు. కాన్పు అయ్యేటంత వరకైనా పొద్దం దాకా నా తిప్పలెవో నేనుపడి నాత్రికన్నా తలదాసుకోవచ్చు....

''నాకు గీదునియల నా అన్నవాళ్లెవలు లేరు ! నేను దయ్యాలను తప్ప నా బతుకుల మనుషుల సూసెరుగ.... సూత్తంటే అదెదో లోకంలున్నట్టున్నది. నా పొట్ట తిప్పలకోసం నేను పడే పుల్లెందులు నేనుపడ్త– నేను దిక్కుమల్లేదాన్ని.... కనీసం...'' మాట ముద్దయిపోయి ఏడుపు పొంగుకచ్చింది. తమాయించుకోను లెసి నిలుసుండి దరువాజ కాడికి నడిసిన.... ఏడుపాగలె– మొకాన కొంగుబెట్టుకొని ఏడ్సిన–

'' సరే మీయిట్టం.... కని ఈడికి రోజు సానా మందత్తరు. వచ్చెటోల్లు అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్ళు ఆకలికి నకనక లాడుకుంటత్తరు... మీకభ్యంతరం లేకుంటే అక్కలా, తల్లిలా కాసంత వండిపెట్టండి. మీ తిండి కోసం ఏరే తిప్పలు పడుడుండదు–''

నేనే మనలే.... అతను మరేంమాట్లాడలే– కాసేపటికి సన్నగా గురక ఇనిపిచ్చింది.

నేనట్లనే కూకున్న – గిదికలా ? నిజమా ? బతుకెటుపోతంది ?

అట్ల నా బతుకు కొత్త మలుపు తిరిగిందని. గతమంతా ఎంతో చేదనైనా, తోడ గలిగేట్లున్న– కష్టాల ప్రజుష్పులతో తింటిన నా బతుకును పెలుగుదిస్తా– తెల్లా

బట్టుక ఈడ్సుక పోతదని నా కెరికనేలేదు. గీ బతుకునాకు ఏంనేర్పిందో సెప్పుకోవటానికి నా దగ్గెరమాటలు లెవు.... నా ఆడదాని మనుసు ఎంత కరిగి నీల్లై పోతందో. అయ్యో నేను మీకెట్లా సెప్పుకోగలను... కండ్లల్ల ఊరే నీల్లతోనే నేను ఏడ్సింది గాదు. నేను మనిషిగా మీ అందరి ముంగడ నిలుసున్న- నా నెత్తురు సివరి బొట్టు సుత మనుషుల కోసం నా తోటి అక్కలకు, సెల్లెండ్లకు, అన్నలకు, తమ్ములకు యియ్యాలనుకున్న.

నేనిప్పుడు మారుమూల పల్లెల ఏటాడబడే జంతువుని కాదు.... కవ్వలు రాపే సుతిమెత్తని, సుంగారమైన ఆడిదాన్ని కానేకాదు. నేను పల్లెల పొలిమేర్లు దాటినదాన్ని— గుడిగుచ్చినట్టున్న గుడిసెల్ల ఇల్లిల్లు దిర్గి నెత్తురు ఇలువ గురించి రాత్రి పగలు నూరిపోసినదాన్ని- నా అన్నలకు, తమ్ముల్లకు కామ్రేల్లకు బుజానికి బుజం కన్నుకు కన్నైనదాన్ని....

○○○

నిన్న విత్తిన వజ్రాలు

—చంద్రశేఖర్

వసంత మేఘం గర్జించిందని
వరుగులెత్తిన నేను
వెలలేని వజ్రాలను
నేలపాల్జేశావని నీ వంటావు
సరే –
ఇవాళ జనసంద్రం వేదెక్కి
ఆవిర్లెత్తి ఆకాశానికి లేస్తోంది.
రేపు తూర్పు గాలిని తాకితే
చైతన్య వృష్టి కురిస్తే
పులకిస్తుంటా
పసిడి పంటలే కదా అంటాను నేను.

రాజకీయాలకు దూరంగా ....

—లక్ష్మారెడ్డి

గాలినుంచి దూరమవ్వా లనుకునే ప్రాణమా !
నువ్వెంత పెద్ద, గొప్ప ఎస్కేపిస్టువయినా
నిర్జీవం కాకుండా నీ పని చేయలేవు సుమా !
ఆకాశపు నిప్పుల దుప్పటిక్రింద
ఒళ్ళంతా కాలిపోయిన జీవమిత్రమా !
ఎక్కడికి వెళ్ళిపోతావో చెప్పు –
ఇనుప ముళ్ళున్న ఈ హిమాలయాలను
మోయడం ఎవరికిష్టం ?
సల సల మసిలే ఇంద్రిన్ నూనెలోంచి
బయటకు పోవడాన్ని ఎవరొద్దంటారు ?
నీ వెంట రావడానికి నేనూ సిద్ధమే !
ఎక్కడికి పోదామో
ఎలా పోదామో చెప్పు
ఈ అంతం లేని సముద్రాన్ని
ఎలా ఈది పోదామో చెప్పు –
అంతర్ముఖుడివై కలల ప్రపంచంలో
స్వర్గ సుఖాలనుభవిస్తున్న నిన్ను
చిన్ని చీమ ఈ లోకంలోకి లాక్కొచ్చిందే —
వెంకటేశ్వరుడి బంగారపు గుడిలో మైమరిచి పోతున్న నిన్ను
పోలీసు లాఠీ వెనక్కి పిల్చుకొచ్చిందే —
సాయిబాబా ఒడిలో సుఖనిద్రపోతున్న నిన్ను
ఆర్థిక మంత్రి చొక్కా పట్టి లాక్కొచ్చాడే —
క్షుద్ర సాహిత్యంలో మునిగి
ప్రేమ నవలల్లో విహరించే నిన్ను

"జ్యోతి" హత్య భూమ్మీద పడేసిందే —
తెరమీద రంభా ఊర్వశులతో రమిస్తున్న నిన్ను
మూడు గంటల తర్వాత
నీ భార్య చిరకున్న రంధ్రాలు
కాలర్ పట్టి ఈ లోకంలోకి తీసుకొస్తాయే —
ఎక్కడికి పారిపోదాం ప్రాణమా !
మూడు లోకాలూ, ఏడు లోకాలూ
నూటా ముప్పయ్యారు లోకాలున్నా
భయంకర న్యూట్రాన్ బాంబునుంచి రక్షించలేవే —
రాజకీయాలనుంచి దూరంగా పోవాలనుకునే జీవమా ?
దానికి పుట్టిన ప్రపంచ యుద్ధాల నుంచి
ఎలా తప్పించుకొంటావో చెప్పు —
సమస్యల రాక్షస రాగాలు తగలకుండా
ఎక్కడికి
పారిపోలేవు నువ్వు —
ఉరిశిక్షల నుంచి, జైళ్ళనుంచి, ఎన్‌కౌంటర్లనుంచీ
తప్పించుకోగలవేమో కాని
మనిషిని సరుకుగా మార్చేసిన
ఈ వ్యవస్థ క్రౌర్యం నుంచి తప్పించుకోలేవ్ —
నువ్వెక్కడికీ పారిపోలేవు
ఆకాశం నిన్ను వెంటాడుతూనే వుంది
భూమి గుండ్రంగా వుంది
నువ్వెక్కడికీ పారిపోలేవు —
భూమి గుండ్రంగా వుంది —

ముక్కలుగ నరకాల

మా ఊరి గుడిలోన ముత్యాలపల్లకి
ఆ పల్లకిని మేము ముట్టరాదంట
ముట్టితే అయ్యేటి అపరాధ మేమన్న ?
మా చెమట కారించి కట్టాము ఆ గుడిని
రక్తాలు కారించి చేశాము పల్లకి
కట్టిన గుడిలోకి పోవగా రాదంట
చేసిన పల్లకి ముట్టరాదంట !
పేదోళ్ళ నడుమలో భేదాలు పెట్టారు
భేదాలు పోకుంటే బతుకెట్ల మారేది ?
మారని బ్రతుకులో మిగిలేవి కన్నీళ్ళు
కన్నీళ్ళు కార్చేటి కూలోళ్ళు మనమంత !
మనమంత తాగేది ఉత్త రాగుల గంజి
గంజినీళ్ళతోన కడుపెట్ల నిండేది ?
నిండని కడుపులతో కూలీకి వెళుతాము
కూలీకి అనిపోతె ఏమేమో పనులమ్మ
చెక్కిన రాళ్ళను నెత్తిపై మొయ్యాల –
ఎండనక వాననక కండ కరిగించాల !
చెక్కరొచ్చి ఒళ్ళంత సుక్కలె తిరిగాయి.
వీపెనుక యజమాని కుక్కట్ల కొశాడు
దయలేని యజమాని పడగనెత్తిన పాము
పాముల నీడలో మనకు తోడెవరమ్మ ?
ఎన్నాళ్ళు ఏగేది కన్నీళ్ళు కార్చుకొని !
కన్నీళ్ళు తుడుచుకొని కొడవళ్ళు ఎత్తుకొని
ఎత్తిన కొడవళ్ళు దించక మనమంత
ఈ పాము పడగలని ముక్కలుగ నరకాల.

[పిండి విసిరేటపుడూ, వడ్లు దంచేటపుడూ కర్ణాటకలోని కోలార్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పాట పాడుకుంటారు.]

సేకరణ : ఎన్. ఆర్.

క్రిటికల్ రియలిజం

మనిషి బైటా లోపటా వాస్తవ ప్రపంచాలున్నాయి. పదార్థంతో కూడింది బైటిది భావాలతో కూడింది లోపటిది. వాస్తవికతావాదానికి ఈ రెండు ప్రపంచాలూ, నిజమైనవే వికరంగా మాట్లాడితే, వీటిని రెండుగా పేర్కొనడం సరికాదు. భౌతిక ప్రపంచం లేకుండా భావప్రపంచం వుండదు గనక, వీటిని ఒకే ప్రపంచంలో రెండు విభాగాలని అనవచ్చు. భౌతిక ప్రపంచమే మనిషి జ్ఞానేంద్రియాల ద్వారా నాడీకేంద్రమైన మెదటికెక్కి, చైతన్యంగా రూపొందుతుంది. మెదడు చాలా జటిలమైన పదార్థం. భౌతికపదార్థానికి అది అత్యున్నతమైన రూపం. దాని పనిపాటులనే బుద్ధిగా, అనుభూతిగా - మనస్సుగా- ఎన్నోపేర్లతో పిలవడం జరుగుతూంది. మెదడు నిర్మాణంలో ఒక పార్శ్వంలా మరొక పార్శ్వం లేదు. శాస్త్రపరిజ్ఞానానికి తార్కిక చింతనకి ఒక పార్శ్వంలోని కణాలలో స్థానం ఉంటే మరోపార్శ్వంలోని కణాలలో కళాభిరుచికి సౌందర్య భావానికి స్థానం ఉంది.

వాస్తవికతావాదం ప్రపంచాన్ని యథాతథంగా కళలలో ప్రతిబింబించ బూనుకోదు. ప్రపంచానికి నకలు తీయగోరదు. అచ్చుకి మచ్చుకాదు మీదుమిక్కిలి, సౌందర్య తృష్ణ లేనేలేకుండా, కేవలం ఉపయోగితా దృష్టితోనే కళాసృజనకుగూడా దిగదు. రెండూ అవసరమే. కళకు ఉపయోగిత ఎంత అవసరమో సౌందర్య పరత కూడా అంతే.

యూరపులో 16 - 17 శతాబ్దాలకాలంలో భూస్వామిక వ్యవస్థ బీటలు పడేలా పెట్టుబడిదారీ వ్యవస్థ వెలువడ సాగినప్పుడు, వాస్తవికతావాదం నిర్దిష్టమైన, బలీయమైన ఒక కళాధోరణిగా ముందుకు వచ్చింది. అయితే లోగడే దాని అంశలు లేకపోలేదు సరిగదా, ఆదిమ మానవుడి గుహా జీవనకాలంనుంచీ మధ్యయుగాల గోథిక్ కళదాకా దానిదే ప్రముఖమైన స్థానం అనవచ్చు. లోక వాస్తవికతను కాదని ఏ కళాకారుడూ పూర్తిగా స్వతంత్రించడం కష్టం. అయితే ప్రారంభంలో, భౌతిక ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్టుగా చిత్రించడమే ఎక్కువగా జరిగేదిగాని,

సామాజిక జీవిత విశ్లేషణకు ప్రాముఖ్యం ఉండేదికాదు. వాస్తవికతా వాదానికి ఇలాంటి విశ్లేషణ ప్రాణతుల్యం.

ప్రాచీన మహా ఇతిహాసాల, మహాకావ్యాల పద్ధతులను అనుసరిస్తూ మధ్యయుగాలలోనేగాక ఆధునిక యుగంలోకూడా కొనసాగిన 'క్లేసికల్' కళాధోరణికి నిజంగా కాలం చెల్లింది. విచ్చలవిడిగా చెలరేగిన భూస్వామిక అరాచకాన్ని తుద ముట్టించి, రాజులు నిరంకుశాధికారంతోటి, నగరోపజీవులైన వర్తక వ్యాపారుల అండదండలతోటి జాతి-రాజ్యాలను (నేషన్ స్టేట్స్) రూపొందిస్తూ వచ్చినకాలంలో యీ ధోరణికి ప్రాచుర్యం వుండేది. వ్యక్తిగతమైన ప్రయోజనాలను తలదన్నేట్టు రాజధర్మాన్ని యిది పైకెత్తడం యిందుచేతనే. ప్రజలు రాజాజ్ఞకు విధేయులుగా వుండాలని యిది నొక్కిచెప్పేది. రాజ్యాన్ని మించిన సంస్థ మరేదీ లేదన్నట్టు, దాన్ని నిరపేక్షం (అబ్‌సొల్యూట్) చేసేది. ఫ్రెంచి మహావిప్లవకాలంలో అనేకులు క్లేసిసిజాన్ని అభిమానించారుకాని, పరిస్థితి అవసరం దృష్ట్యా దానికి విప్లవాత్మకతను జోడించడం జరిగింది. సంకుచితమైన వ్యక్తి స్వార్థప్రయోజనదృష్టిని ఈసడిస్తూ, సమస్త ప్రజానీకానికి చెందిన సామాజిక ప్రయోజనాలకు ఆధిక్యత నిచ్చారు.

ఇదేకాలంలో కాల్పనికవాదం (రొమేంటిసిజమ్) కూడా మొదలైంది. క్లేసిసిజానికి రొమేంటిసిజానికి పొత్తుకుదరదు. కళాధోరణులు చాక్రికంగా (సైక్లికల్), పరిభ్రమిస్తూ వుంటాయి. ఏ యుగంలోనైనా వివిధ సామాజిక వర్గాల సహజీవనాన్ని ప్రతిబింబిస్తూ అనేక కళాధోరణులు ఏకకాలంలో వాడుక కావడం జరుగుతూ వుంటుందిగాని, ఒకే ఒక్కదానికే ప్రాచుర్యం ఉండదు. ఉదాహరణకు, వాస్తవికతావాదధోరణి ప్రబలంగానే వుండిన గెటే, షిల్లర్ రచనలలో క్లేసిసిస్టు ధోరణులూ ప్రముఖంగానే కనిపిస్తాయి.

కాల్పనికతాధోరణికి రూసో రచనలు ప్రారంభమని చెప్పవచ్చు పుట్టుకతోనే మనిషి స్వేచ్ఛావంతుడైనా ప్రతిచోటా సంకెళ్ళకు లోబడి ఉంటున్నాడని రూసో అన్నాడు. నిజానికి, జన్మతః మనిషి స్వేచ్ఛావంతు డేమీకాదు సమాజంలో విభిన్నమైన వర్గాలలో పుట్టే మానవ వ్యక్తులమధ్య అజన్మంగానే హెచ్చు లొచ్చులు తప్పవు. దాని నటుంచి, పెట్టుబడిదారీ వ్యవస్థలో 'స్వేచ్ఛ' ఆస్తిపరులైన భూస్వాములదీ వర్తకులదీ పరిశ్రమాధిపతులదీ మాత్రమేగాని, మిగిలిన వారిది కాదు. అసమానతతో వర్గవైషమ్యాలతోగూడిన ఈ వ్యవస్థను కాల్పనికతావాదం కూడా అంగీకరించిందనడానికి వీలులేదు. ఆదిమ మానవజీవితం అకృత్రిమంగానూ

హాయిగానూ వుండేదంటూ కాల్పనికతావాదుల్లో కొందరేమో తమ అభిమానాలను వెనకతెన్ను పట్టిస్తే మరికొందరు ఆనాటి వికారమైన వాస్తవాన్ని నిరాకరిస్తూ ఉజ్వలమైన భవిష్యత్తుగురించి ఊహాగానం చేశారు. కాల్పనికతావాదానికి మొఖాలు ఇలా రెండుగా రూపొందాయి. బూర్జువా వ్యవస్థమీద కళాకారుల తిరుగుబాటునుంచే ఈ ధోరణి ఉత్పన్నమైందిగాని, ఆ వ్యవస్థను విశ్లేషించి సామాజిక సంబంధాల పరస్పరతనూ సంఘర్షణనూ చిత్రించలేదు. సుదూర గతంగురించో సుదూర భవిష్యత్తుగురించో కలలుగనే చిత్తవృత్తిని అది పెంపొందించింది. వాస్తవాన్ని భీమగా ఎంచింది. అందుచేత వాస్తవికతావాదానికి భిన్నమైన పంథా పట్టింది. ఎర్నెస్ట్‌ఫిష్షర్ అభిప్రాయాన్నిబట్టి, భూసంపన్నవర్గానికి చెందిన క్లేసిసిజంమీద పెటీబూర్జువావర్గం చేసిన తిరుగుబాటే, ప్రారంభంలో కాల్పనికతావాదం.

బూర్జువా వ్యవస్థలో ప్రతిదీ ధనానికి అధీనమైపోయింది ఆచార సంప్రదాయాలు ఎక్కడికక్కడ చెక్కలు ముక్కలయ్యాయి. వ్యక్తి స్వప్రయోజనం పరమార్థమైంది. ప్రతిదీ–మనిషికూడా– సరుకు (కమోడిటీ) అనే భావం పెరిగింది. మొదట్లో కళలకు 'గిరాకీ' లభించలేదు. అయితే ఈ సామాజిక విప్లవం వల్ల మనుషుల భావలోకంలో వచ్చిన పెనుసంచలనం ఎన్నో కొత్త కళారూపాలకు దారితీసింది. నవల అలా ఏర్పడిందే, కథ కూడా అంతే. ఈ రూపాలు అతివేగంగా వృద్ధిపొందడమే గాక, స్థానిక పరిమితులను మీరి యావత్ దేశానికేగాక ప్రపంచానికి సైతం వ్యాపించడానికి భౌతిక అవకాశాలు అనుకూలించాయి. జాతీయ విముక్తి ఉద్యమాలకూ రాజ్యాంగబద్ధ పరిపాలనా పోరాటాలకూ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకూ ప్రోత్సాహాన్నిస్తూ వచ్చిన యీ కొత్త వ్యవస్థ 1848 నాటికి అనేక యూరపియన్ దేశాలలో అభివృద్ధి నిరోధకమైన భూస్వామ్య శక్తులతో నిరంకుశ రాచరికంతో రాజీపడింది. ఈ మార్పు కళాలోకంలోనూ ప్రతిబింబించింది. పెట్టుబడిదారీ విధానం కదగట్టేసరికి. దోపిడీ పెరిగేసరికి, కార్మిక వర్గం తొలి పోరాటాలను అణచివేసేసరికి, తక్కిన సామాజిక వర్గాలు చితికిపోసాగేసరికి, భావకల్లోలం కూడా వ్యాపించింది. ఈ వ్యవస్థను తీవ్రంగా విమర్శించడం కళాకారులకు విధాయకమయింది. ఈ ధోరణే క్రిటికల్ రియలిజం. 'కాల్పనికతావాదం' చేసిన తిరుగుబాటు ఈ ధోరణికి తొలిరూపమే. అయితే మొదటిది 'అహం' (ఐ) కేంద్రంగా భోను భోసు లోకంనుంచి పలాయనత్వానికి దారితీస్తే, రెండోది సామాజిక వాస్తవాన్ని నిరాకరిస్తూనే దాన్ని విమర్శకు గురిచేస్తూ విశ్లేషించ

బూనింది. ఇదీ కళాకారుడి 'అహం'ను తోసివెయ్యలేదుగాని ఉన్న వాస్తవ స్థితిని వ్యక్తిపరంగా విమర్శించింది. నిర్దిష్టమైన ఒక భావ ప్రకటనా పద్ధతిగా పెంపొందింది. విమర్శాత్మకత ఒకవైఖరి, వాస్తవవాదం ఒకపద్ధతి ఇందులో ఒక రచయితలా మరో రచయిత రాయడు. ఎన్నెన్నో భేదాలు, ఎన్నెన్నో దృక్పథాలు.

బూర్జువా వ్యవస్థ అభ్యుదయాత్మకంగా వుండిన రోజుల్లో వాస్తవికతా వాదం సమాజ స్థితిని గురించి ఆశామయ దృష్టితో చూసేది. దాని వైరుధ్యాలను పట్టించుకునేది కాదు. మనిషిని మనిషిగా మాత్రమే చూసేదిగాని, సమాజంతో మనిషికిగల సంబంధాలను చూపేదికాదు. జీవితాన్ని పరిణామాత్మకంగా వర్ణించలేదు. ఈ పని చేసింది విమర్శాత్మక వాస్తవికతా వాదమే. కాల్పనికతా వాదుల్లో విప్లవ వాదులు కూడా పెట్టుబడిదారీ అభివృద్ధిలోని వైరుధ్యాలను చూడగలిగారు. మొత్తం సామాజికాభివృద్ధికి సంబంధించిన వైరుధ్యాలను సాకల్యంగా గ్రహించి, బూర్జువా సామాజిక వ్యవస్థకూ అందులో మానవ చైతన్యానికి గల ప్రముఖ లక్షణాలను బోధపరచుకుని తమ రచనలలో ప్రదర్శించింది. విమర్శాత్మక వాస్తవికతా వాదులే కాల్పనిక వాదుల్లా పిచ్చు జ్ఞానాన్ని, విజ్ఞానోదయాన్ని (ఎన్‌లైటెన్‌మెంట్) తృణీకరించలేదు. జిజ్ఞాసను ఈసడించనూ లేదు. బూర్జువా వాస్తవికతా వాదుల్లా సామాజిక పరిస్థితిని యథాతథంగా చిత్రిస్తూ, అనుభవజ్ఞానవాదాన్ని (ఎంపిరిసిజం) అవలంబించనూ లేదు. బూర్జువా వ్యవస్థ ఎంత అమానుషంగా రూపొందిందో చూపెట్టారు. అప్పుడప్పుడే పైకి రాసాగిన కార్మికవర్గం కూడా కళాసాహిత్యాలలో ప్రవేశించింది. దాని పట్ల సానుభూతితో గూడిన భావవైఖరి ఎందరో రచయితలకు అలవడింది. విప్లవాత్మక కాల్పనిక వాదులు సరిగా యీ సమయానికే రూపొంది యిలాంటి వైఖరినే అవలంబించారు. పెట్టుబడికీ కాయకష్టానికీ మధ్యగల వైరుధ్యాన్ని చూశారు, చిత్రించారు అయితే దాని పరిష్కారం వాళ్ళకు అంతు చిక్కలేదు. తామింకా బూర్జువా ప్రజాస్వామిక భావాలనుంచి బైటపడలేదుగనక, ఈ వైరుధ్యాన్ని చూడవలసినంతలోతుగా చూడలేకపోయారు. దీనికి వీరిని తప్పుబట్టి లాభం లేదు. కార్మికోద్యమమే ఆనాటికింకా నిర్దిష్టమైన శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబించడం జరగలేదుగదా !

కొత్తగా ఏర్పడి శీఘ్రంగా కరుడుగట్టిన సామాజిక వ్యవస్థ సారాన్ని తెలుసుకుని, దాని స్వభావాన్ని రచ్చకెక్కిస్తూ సామాజిక, వైయక్తిక జీవిత విశేషాలను కళాత్మకంగా చిత్రించడమేగాక, చారిత్రక క్రమం పురోగమన శీలమనికూడా

అస్పష్టంగానైనా సూచించారు. పెట్టుబడిదారీ అభివృద్ధి వల్ల సమకాలిక సమాజంలో ఎలాంటి ఫలితాలు కలిగాయో చూపినంతగా, ఆ సమాజంలోపలే క్రమంగాబలాన్ని సమైక్యాన్ని సంతరించుకుంటున్న శక్తులను చూపలేదు. అసలు దానికి మించినపని. సోషలిస్టు భావజాలం అప్పటికి శైశవదశలోనే వుండి పోవడం దీనికి కారణం. సంస్కరణల మూలాన సమాజం మారవచ్చునని కొందరు, విద్యా విజ్ఞానాల మూలంగా భావపరివర్తనద్వారా మారవచ్చునని మరికొందరు భావిస్తూ వచ్చారు. 'ఊహాజనిత' సోషలిజం ప్రభావానికి ఇది నిదర్శనం కావచ్చుగాని శాస్త్రీయ సోషలిజానికి కాదు. మనిషి జీవించే భౌతిక, భావ పారిసర్యాన్ని మార్చడంవల్ల అతనికి తనగురించి తెలిసివస్తేచాలు, తన స్థితిని తాను బాగుజేసుకుంటాడనేది, అప్పటి భౌతిక వాదానికే లక్ష్యమైనప్పుడు. కళాకారులు ఇంకా ముందుకి పోలేదనడం సవ్యమైన విమర్శ కాదు. 19వ శతాబ్దం ద్వితీయార్ధ భాగంలో వాస్తవికతావాద సాహిత్యం వ్యక్తి మనస్తత్వాన్ని గానీ, కుటుంబగాధలనుగానీ ఎక్కువ పట్టించుకుంది. నైతిక విషయాలకు ప్రాముఖ్యం యిచ్చింది. చిత్త సంస్కారాన్ని ఆశించింది. ఇవికేవలం భ్రమేనని గ్రహించలేదు. సమాజ జీవుల భావాలను సంస్కరించడం మూలాన్నే సామాజిక వ్యవస్థ మారదు. తమకు ప్రతీతమైన ఆర్థిక శక్తులను గుర్తించి చైతన్యవంతగానూ సంఘటిత విప్లవ కార్యాచరణతోనూ అది మారవలసిందే. ఈ అవగాహన ఆనాటి వాస్తవికతావాదులకు లేకపోవడం ఆశ్చర్యకరంకాదు. ఎందుకంటే, అప్పట్లో బూర్జువా సమాజం మొత్తం మీద నిలకడగా వుపద్రవరహితంగా వుండేది. తీవ్రమైన వర్గ సంఘర్షణలు ఎక్కువగా వుండేవికావు. మీదు మిక్కిలి, వర్గ సామరస్యభావాలకు హెచ్చు చలామణీ వుంటూ వచ్చింది. అందుచేత విమర్శాత్మక వాస్తవికతావాద సాహిత్యం గతశతాబ్ది చివరి నాటికి, కథానాయకులను వారి పారిసర్యం నుంచి విడిగా చూపుతూ, అతని గుణశీలాలమీదనూ ప్రవర్తన మీదనూ తప్పని సరిగా పడే సామాజిక ప్రభావం నుంచి వేర్పరిచింది. ఆ రెంటికీగల సమైక్యాన్ని ప్రముఖంగా చూపెట్టలేదు చారిత్రక వైరుధ్యాలతో నిండిన సమాజ జీవిత పరిధిలోపల వ్యక్తి చిత్రణకు ప్రాముఖ్యం ఇవ్వలేదు.

ఈ శతాబ్దంలో టాల్స్టాయిగానీ చెహవ్‌గానీ గోర్కీగానీ, సమాజ భవితవ్యంగురించి ఎక్కువగా పట్టించుకునే రచనలుచేస్తూ, విమర్శాత్మక వాస్తవికతావాద ధోరణిని మూలాకు వేయించారు. అప్పటికే పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులు కదలసాగాయి. సామ్రాజ్యవాదంగా ముదిరిన పెట్టుబడిదారీ విధానం తన అత్యున్నత దశను చేరుకుంది. విప్లవాల యుగానికి ఇది నాంది.

మాదాల వస్తున్నాడు తప్పుకోండి!

— జింకా నాగరాజు

అధికార మార్పిడి తర్వాత సమాజంలో మార్పులు వేగవంతమయ్యాయి. ఈ వేగాన్ని దేశంలో కళాసాహిత్య రంగాలు అందుకోలేక పోయాయి. సాధారణంగా కళ ప్రయోజనాల దృష్ట్యా ఆలోచిస్తే కళ లెప్పుడూ జీవితం నుంచి ఉబ్బుకొచ్చి ప్రజా చైతన్యం కంటే ముందుండి శాస్త్రీయంగా భావి దిశను సూచించాలి. అయితే భూస్వామ్య పునాదులమీద, సామ్రాజ్యవాదుల ఆర్థిక పెత్తనంతో ఎదుగుతున్న అవిటి ఆర్థిక వ్యవస్థ కాబట్టి తన పెత్తనాన్ని నిలబెట్టుకునేందుకు 'స్వభావంగా' పెట్టుబడిదారి విధానం కళల్ని సరుకుల్ని చేసుకుంది. సినిమా ఆ కక్ష్యలో ముందు భాగాని కొచ్చింది. అనివార్యంగా సమాజ వైరుధ్యాలు తీవ్రతరమయ్యాయి. ఫలితంగా వ్యాపార సినిమాలు, పాత భావాల్నింక ప్రచారం చేయలేని స్తబ్ధతకు గురయ్యాయి. సినీ కళారంగంలో ఆవహించిన ఈ తరహా జడత్వాన్ని ఒక తన్ను తన్నేందుకు 'వెరైటీ' అవసరమైంది. ఏ వెరైటీ కావలసింది నేటి పరిస్థితులు సృష్టించేశాయి.

అటువంటి సమయంలో "కర్మ జన్మల కుష్ఠు వ్యవస్థ మారేంత వరకు మీరు మారరు" (విప్లవశంఖం) అంటూ తానే మారుస్తానని కొత్త తరహా బాణీలో రంగమ్మీది కొచ్చాడు మాదాల. మొత్తం మూడు సినిమాలు ఇప్పటి కొచ్చాయి: 'యువతరం కదిలింది', 'ఎర్రమల్లెలు', 'విప్లవ శంఖం'.

ఈ మూడు సినిమాల్లోవున్న గాండ్రింపులు, అట్టహాసాల్ని చూసి మనం 'ఓహో ఇవి కమ్యూనిస్టు సినిమాలు కాబోలు' అనుకోవాలి. పాలకవర్గాల మీద అసంతృప్తి పెరిగి దేశంలో విద్యార్థులు విప్లవ రాజకీయాలవైపు మరలటం, కార్మికవర్గం నాయకత్వం కింద రైతాంగ శక్తులు మెల్లిమెల్లిగా రోజురోజు సమీకృతం కావటం, పోరాటాల్ని చేయటం, ఈ పోరాటాల ప్రేరణతో రచయితలు సాహిత్యాన్ని సృష్టిస్తూంటే కొంతమంది కళాకారులు ఈ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకుపోయేందుకు కృషి చేస్తూ వుండటం – ఈ మొత్తం ఒక ఉద్యమంగా పాలకవర్గాలను కల్లోలాలకు గురిచేయడం ఫలితంగా అణిచివేత,.... పట్టణాల్లోని మధ్యతరగతి మేధావులపై దీని ప్రభావం పడటం.... మొత్తంగా ఈనాటి సమాజ పరిస్థితి.

ఈ పరిస్థితి నంతా సొమ్ము చేసుకోవాలనుకున్నాడు మాదాల. అందు కోసమే వేస్తున్న కుప్పిగంతులు పై మూడు సినిమాలు.

ధీరోదాత్తుడయిన ఒక పంతులు ప్రవక్తలా నలుగురు విద్యార్థులకు జ్ఞానోదయం కల్గించి, అమాంతం విప్లవకారుల్ని చేసి రంగమ్మీదకు తోలి దొంగ సరుకుల నిల్వ వెలికి తీయడం లాంటి 'విప్లవాల్ని' చేయిస్తాడు.

కార్మికులకూ గూండాలకూ జరిగే కొట్లాటలు, ఒక రేప్ సీను, రెండు పాటలు 'ఎర్రమల్లెలు'.

ఒక కళాకారుడు నాల్గు కోతిమూకలు 'విప్లవం' అట్టహాసం విప్లవ శంఖం. ఈ మూడు సినిమాల్లో వ్యక్తిగత ప్రతాపం (individual heroism) ప్రాణం. హీరో ఎక్కడబడితే అక్కడ ప్రత్యక్షమై ఆర్తత్రాణ పరాయణుడులా "ప్రజల్ని" కాపాడుకుంటూ వుంటాడు. దీని పతాకస్థాయి 'విప్లవశంఖం'.

అనగనగా ఓ నిరుద్యోగి. కాబట్టి కళాకారుడయ్యాడు. ఇతడు నల్గురు కళాకారుల్ని (నిరుద్యోగులు కాబట్టి) గుంపు చేసుకుని, ఒక మంచి యూనిఫామ్ కుట్టించుకుంటారు. తగిన ఆర్కెస్ట్రా సరంజామాతో విప్లవం తీసుకురావాలని ఒక శుభముహూర్తాన నిశ్చయించుకోవటం. దీనికి కొంచెం మసాలా కల్పితే సినిమా. విప్లవం ఎలా వస్తుంది, ఎవరు తెస్తారు, అనే దానిపట్ల ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేదు కాబట్టి తామే తీసుకురావాలని ప్రయత్నం చేస్తారు. ఈ ప్రయత్నానికి నాయకత్వం వహించేది రంగా అన్న. అయ్యగారి పార్టీపేరు "నవతరం" అనే సాంస్కృతిక దళం.

విప్లవకేంద్రం నవతరం ఆఫీసు. అరటిచెట్టు – తీగల అల్లికలు. ఒక పెద్దబోర్డు. లోపల రకరకాల నాయకుల ఫొటోలు – నినాదాలు రాసిన అట్టలు. దోపిడీ వ్యవస్థను కూలద్రోసేందుకు అవసరమైతే సైన్యంగా మారేందుకు సిద్ధంగా వున్న 'విప్లవకారు'ల బహిరంగ బజారుకేంద్రం అది.

రంగా ఉన్నది కండలు తిరిగిన దేహం. బహు ధైర్యశాలి. తనలాంటి బలం కల్గిన అయిదారు మంది రౌడీలను తనొక్కడే ఎముకలు విరిచేయగల పరాక్రమం. ఈలాంటి రంగా తన బృందంతో కార్యక్రమాలు యిస్తూవుంటాడు. ఒకచోట ఆయనకు కలెక్టర్‌గారి ఆశీస్సులు కూడ దొరుకుతాయి.

బృందంలో వున్న ఒక కళాకారిణికి చెప్పే మాటలు "... నాకు కార్మిక వాడలో మీటింగ్ వుంది..." అనే దాన్నిబట్టి రంగా కార్మిక నాయకుడూ అని అనుకోవాలి. ఒకసారి కార్యక్రమా లిచ్చుకుంటూ ఒక పల్లెకు పోతారు. దాన్ని బట్టీను, ఒకసారి చివర్లో జరిగే ఊరేగింపులో ఒక రైతు (?) కనబడేదాన్ని చూస్తే రైతాంగ నాయకుడునూ అని ప్రేక్షక మహాజనులు గుర్తించుకోవాలి. అంటే, రంగ (మాదాల) దశావతారాలెత్తి అన్నిచోట్లా కనపడుతుంటాడు. రౌడీలను చితకగొడతాడు. ఇటువంటి వీరోచితమైన కొట్లాటలలో (Heroic fightings) లో రంగా బృంద మెక్కడా కనిపించదు. సాధారణంగా ఎంతమంది వచ్చినా ఎదుర్కొగల నాయకులుగా వుండాలి అని అర్థం కాబోలు (విప్లవకారులంటే) ? యాక్సిడెంట్సయి ఎవరైనా చచ్చిపోతే, రౌడీలు అమ్మాయిల్ని లేపుకుపోతే, కాంట్రాక్టరు ఎవరినైనా చంపితే, అమ్మాయిల్ని ఎవరైనా అల్లరిచేస్తే, రంగా టకీమని ప్రత్యక్షమౌతాడు. అందర్నీ రక్షించేస్తాడు.

సినిమాలో ఒకచోట ఒక కంట్రాక్టర్ భార్యను రౌడీలు కారులోవచ్చి ఎత్తుకుపోతారు. ఆమె నగల్ని తీసుకొని అంతా మానభంగం చేస్తారు. అక్కడున్న రౌడీలందర్ని హీరో చితగ్గొట్టి కంట్రాక్టరుకి ఆమె నప్పగించి ధన్యజీవిఅవుతాడు.

సినిమాలో దోపిడి, దొంగప్రభుత్వం, లంచగొండి ప్రభుత్వమని గావు కేకలు వినపడతాయి. తీరా ప్రభుత్వ దోపిడి ఎక్కడా కనిపించదు- భూమిమీద అప్పులిచ్చే ఒక (తనఖా బ్యాంకు) కార్యాలయంలో తప్ప. ఆ సంఘటనను చూస్తే ప్రభుత్వం లంచగొండి కాదు. ప్రభుత్వం పేదరైతులకు ఎరువులకు, మోటార్లకు విత్తనాలకు అప్పులిస్తుంది. ఎటొచ్చీ గుమాస్తాగాళ్ళంతా లంచాలుమేసి రైతులను పీల్చి పిప్పిచేస్తున్నారు. అసలు సమస్యలల్లా గుమాస్తాలకు రైతులకూ అన్నట్లు అనుమానం కల్గిస్తాడు. కమ్యూనిస్టు విశ్లేషణ కాబోలు !

ఇంక రుణాలు మంజూరు కావటం చాలాతేలిక, కరణంగారి సంతకం చాలు. మరి ఇది నిజమేనా ! మాదాలకు తెలుసోలేదో రుణంకోసం భూమి తనఖా బ్యాంకులో అప్లికేషన్ ఖరీదు 25 రూపాయలు, అప్లికేషన్ పూర్తి చేసి ఆఫీసులో యిస్తే వందరూపాయలు తీసుకొంటారని, అప్లికేషన్ వేసిన సంవత్సరానికిగాని, రుణం మంజూరుకాదనీ. సినిమాలో ఎక్కడైనా ప్రభుత్వం లంచగొండి అనుకోవాలనుకుంటే, ఈ సంఘటన ఒక్కటే గతి. ఇది నిజమా ? గుమాస్తాలు రైతుల్ని పీల్చి పిప్పిచేస్తున్నారేననుకున్నా, ఆఫీసర్ మాటేమిటి.

తర్వాత రెండో పెద్ద సంఘటన. అప్పుచేసి అమ్మాయి పెళ్ళి చేయటం. కట్నం సరిగ్గా యివ్వనందుకు, ఆమెను అత్తగారు నానాహింస పెట్టటం, చివరకు ఆమె వాళ్ళను వదలి రావటం, ఇంతకుముందు ఆమె 'నవతరం' విప్లవ సాంస్కృతిక దళసభ్యురాలు కాబట్టి మళ్ళీ అందులో చేరడం.

ఇల్లు తాకట్టుపెట్టి అప్పు తెస్తాడు ఒక గుమస్తా, కూతురు పెళ్ళికి అప్పిచ్చిన పెద్దమనిషి ఇల్లు స్వాధీనం చేసుకుంటానని బెదిరిస్తాడు ఆ తర్వాత మర్చిపోయాడేమో. ఆ కథేజరుగదు.

ఎమ్మెల్లే, సారాకంట్రాక్టరు, లాయరు ఇంకో ఇద్దరు (భూస్వాములు, పెట్టుబడి దారులు) కలిసి రంగా సాంస్కృతికంగా ప్రజల్లో తెస్తున్న 'చైతన్యం' చూసి బెంబేలు పడిపోయి, రంగా చేస్తున్న వీరోచిత స్టంట్స్ చూసి అదిరిపోయి, రంగాను సంప్రదింపులకు పిలిపిస్తారు, అవసరమైనంత మంది గుండాల్ని రెడీ చేసుకుని. ఏ మాత్రం జంకు గొంకూ లేకుండా, సంప్రదింపులు అసలు అవసరమా అనే కనీసం జ్ఞానం లేకుండా మన హీరో (సహజ ధైర్యశాలి) ఒక్కడే ఆ భూస్వాముల మందిరానికి సంప్రదింపులకు పోయి, రాజీకుదరక, జరిగే స్టంటులో అయిదు మంది రౌడీల్ని చంపి, (ఏమయ్యారో తెలియదు. ఒకడు మాత్రం తలుపు పగలగొట్టుకొని రంగ బయటకొచ్చినపుడు దభీమని కిందబడతాడు. చచ్చాడను కోవాలి.) ముఖానికింత రక్తంతో బయట కొస్తాడు విజయోత్సాహంతో (కాదు ... కాదు.... విప్లవోత్సాహంతో) దారిలో సారాకంట్రాక్టరు, తన భార్యను రౌడీలు 'రేప్' చేసినప్పుడు చూసిన రిక్షావాలా. ఏమైనా దాన్ని ప్రచారం చేస్తాడేమోనని ఏదో సారాలో కలిపితాపి (చంపేందుకు) పంపిస్తాడు. అతను చస్తాడు. రంగా వస్తాడు. విషయం తెలుసుకుని రంగా కాంట్రాక్టరు యింటికొస్తాడు. వచ్చే వేళకు కాంట్రాక్టరు మానభంగం చేయబడ్డ భార్యను ఉంచుకునేందు యిష్టపడక, భార్యచేత బలవంతంగా విడాకుల కాగితమ్మీద సంతకం పెట్టనందుకు ఆమెని హింసిస్తుంటాడు. ఎంతకూగాక, కాంట్రాక్టరు భార్యమీద కిరసనాయిలు పోసి నిప్పంటించేటప్పుడు రంగా ఆమెని రక్షిస్తాడు

సినిమాలో హాస్యాస్పదమైన సంఘటన ఇంకొకటుంది ఒకసారి హీరో తన విప్లవ సాంస్కృతిక బృందానికి రాజకీయతరగతి లాంటిది జరుపుతుంటాడు. అపుడు హీరో "మనం అన్నివర్గాల ప్రజల్లోకి పోవాలి. వాళ్ళలో చైతన్యం తేవాలి. విప్లవంలో సమీకృతం చెయ్యాలి" అంటాడు. అంటూనే మిగిలిన వాళ్ళలో

అన్నా ! ఇది సమయం కాదన్నా" అని ఒకరు. "ఇప్పటికే మన వాళ్ళు చాలామంది దిగజారిపోయారు." అవి ఇంకో కథు ఇలా జరుగుతాయి. ప్రేక్షకులు "ఆహా.... ఇప్పుడేదో జరుగబోతోంది. విప్లవమేమో ! లేకుంటే ఏ పోలీసు స్టేషన్ మీదైనా (సినిమాలో చివర్లో తప్ప పోలీసులు కనిపించరు) దాడిచేస్తున్నారేమో".... అను కుంటారు. తీరాచూస్తే ఏమీలేదు. ఒకపెద్ద ఊరేగింపు హఠాత్తుగా కనిపిస్తుంది. ఎందుకు వస్తారో ఎవరికి అర్థమైచావదు.

సినిమాలో కీలకమైన మలుపు కుట్రకేసు. కాన్పూరు కుట్రకేసుదగ్గ ర్నుంచి తిరుపతి కుట్రకేసు వరకు విప్లవకారులమీద, కళాకారులమీద కుట్రకేసులు పెడుతునేవున్నారు. వీటిలో ఎక్కడా సినిమాకుట్రకేసులాంటిది కనిపించదు.

ఈ కుట్రకేసులో స్త్రీహత్య కేంద్రం చేసుకుని నాలుగు రౌడీ పనులు చేసిన కేసులు కలుపుతారు అది కుట్రకేసు అవుతుంది. ఇంకకోర్టులో తనమీద బనాయించిన తప్పుకేసును చూపి హీరో తానున్నచెక్కబోను పగులగొట్టి లాయర్ని కిందపడవేసి బాగా కొడతాడు. (ఈ మధ్యలో బయట విపరీతమైన నినాదాలహోరు) తర్వాత మద్దాయి- హీరోకు ఒక యినుపబోను తెస్తారు. దాని కడ్డీల్ని కూడ వంచు తాడు. (జాగ్రత్తగా చూస్తే కనబడుతుంది.) ఉరిశిక్ష పడుతుంది. వేలాదిగా జనం బయట నినాదాలు చేస్తు వుంటారు. ఉరిశిక్షవేసిన వాడిని పబ్లిక్‌గా (మరి అంత గొప్ప విప్లవకారుణ్ణి) జనం గుంపుల్లోంచి తీసుకొచ్చి వ్యాన్ ఎక్కిస్తారు. ప్రభుత్వా నికి "ఆ.... వీడెక్కడ తప్పించుకుంటాడు, ఈ జనం ఏం చేస్తారు ?" అని ధైర్యం కాబోలు. నిజానికి ఉరిశిక్షపడ్డ విప్లవకారునికి ఎంత బందోబస్తు, ఎంత పోలీసు మంది మార్బలమూ సమకూరుస్తారో మాదాలకు తెలిసినట్టులేదు. కామన్ సెన్సు వుండాలికదా !

ఒక ప్రక్క ఉరితీస్తూవుంటే, బయట జైలుగోడల చుట్టూ నినాదకారులు. ఉరిశిక్ష ఎంతరహస్యంగా జరుగుతుందో తెలుసుకుంటేగదా ? ఈ మాత్రం జ్ఞానం వుండనక్కర్లేదా ! హమ్మయ్య ... ఎట్టకేలకు సినిమా అయిపోయిందని పిస్తుంది, చూసినోళ్ళకి.

ఈ దేశంలో ప్రధాన వైరుధ్యాలేమిటి ? వాటి చిత్రీకరణ సినిమాలో ఎలా వుండాలి అనే దాని పట్ల ఏక్కువ ఆసక్తి లేదు. కాని అట్టహాసాల గోల. సినిమాలో ఏక్కడా ప్రభుత్వ దోపిడీకానీ భూస్వాముల దోపిడీకానిచూపించే సంఘ

టనలు లేవు. పోరాటాలులేవు. కాకపోతే, ఒక రైతు, ఒక ఉద్యోగి, కొందరు కార్మికులు, కొన్ని గుడిసెలు. నలుగురు రైతుకూలీల్ని, బ్రిడ్జిక్రింద పడివున్న నలుగురు భిక్షగాళ్ళని ఏదో సంఘటనల్లో అక్కడక్కడా తప్పితే తప్ప చూపి "దోపిడి రాజ్యం దొంగల రాజ్యం దొంగనోట్ల రాజ్యం" అనే గావుకేకలు వినిపిస్తాడుహీరో.

ఏ పోరాటం లేకుండా, ఏ రాజకీయ ప్రచారం లేకుండా రెండుపాటల్లో ఆయన విప్లవచైతన్యాన్ని, తద్వారా విప్లవాన్ని తీసుకురావాలనుకున్న 'పచ్చి' కమ్యూనిస్టు సినిమా చివర్లో కనిపించే జన సమూహానికి ఈయనే నాయకత్వం వహించాడన్నట్లు హీరో స్వైరవిహారం సినిమానిండావుంది. మిగిలిన వాళ్ళు 'కోరస్'కుతప్ప మరెందుకూ పనికిరారేమో !

ఈ రోజు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరహక్కుల సంఘాలు ఎన్ని కష్టాలకు గురైతున్నాయి. ఒక మీటింగు పెడితే రెండో మీటింగ్‌కి పర్మిషన్ యివ్వరు. ఎన్ని విప్లవ సాంస్కృతిక దళాల్ని అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేయలేదు ? మరి మన రంగాకు ఎక్కడా తన మీద పోలీసు దౌర్జన్యాలుగాని, తన బృందం మీద భూస్వాముల, పెట్టుబడిదారుల దౌర్జన్యాలుగాని, ఏమీకానరావు. ప్రోగ్రాము లిచ్చేటప్పుడు మధ్యలో బ్రోకర్‌గాళ్ళేమిటి ?

మంచిసినిమా తీయాలంటే సమాజాన్నిగూర్చి స్పష్టమైన అవగాహన, విప్లవంగూర్చి శాస్త్రీయ దృక్పథం వుండాలి. రాజకీయాల్లోబద్ధ సినిమాల గతి ఇట్లా వుంది దీన్నెవరైనా చూస్తే దేశంలో కమ్యూనిస్టులంతా యింతే కాబోలు అనుకోక చస్తారా ?

ఊరూరికి మాదాల రంగాలాంటి ఒక వస్తాదుంటేచాలు, విప్లవం అయిదు నిమిషాల్లో వచ్చేస్తది. కాకుంటే రెండుగంటల్లో. వీటిమధ్యలో అసందర్భమైన నినాదాలు. నటనలో భయంకరమైన కృత్రిమత్వం. ఇవి 'ప్రజానాట్యమండలి' స్వరూపాలే.

విప్లవంపట్ల ఒక అసహన వాతావరణాన్ని ఆలోచించేవారికి కల్పిస్తుంది ఈ సినిమా. సాఫీగా ఏ అడ్డంకులు లేకుండా సినిమాలో విప్లవం వస్తుంది. ఇటువంటి చెత్తరకం సినిమాకు పాటలు రాసిన వంగపండును తలచుకుంటే (శ్రీశ్రీని అటుంచి) బాధకల్గుతుంది. వంగపండు విరసం సభ్యుడు. విరసం పోరాట సంస్థ. విరసానికి కళాకారులు లేరా ? విరసానికి విప్లవకారులు లేరా ? వారికి ఈసినిమాలో

— [illegible]

పరిష్కారం

— పాపినేని శివశంకర్

అంధకరాజ్యంలో రైతులు నిద్రలేచారు. శిస్తుల భారం పెరిగిపోతోందనీ, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయనీ, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించటం లేదనీ వాళ్ళు ఎలాగైతేనేం గ్రహించగలిగారు. ప్రభుత్వానికెన్ని విన్నపాలు చేసినా ఫలితం లేకపోవటంతో రైతులోకంలో ఆందోళన చెలరేగింది. సమ్మెలూ, సత్యాగ్రహాలూ ప్రారంభమయ్యాయి. రైతులు పండించిన పంట మార్కెట్‌కు చేరటంలేదు. తత్ఫలితంగా ధరలు పెరిగి బజారు బజారే బేజారెత్తేలా ఒడిదుడుకుల పాలైంది. మంత్రులు కాలు బయట పెడితే నిరసన ప్రదర్శనలూ, పికెటింగ్‌లూ ఎదురవుతున్నాయి. క్రమక్రమేణా ఉద్యమం ఇతర ప్రాంతాలకూ పాకుతోంది. పోలీసులు ఎంత అణిచివేస్తున్నా ఉద్యమం రబ్బరు బంతిలా పైకి లేస్తోంది. హింసాకాండ తలెత్తసాగింది. ఉద్యమం దానంతటదే చల్లారిపోతుంది లెమ్మని ప్రభుత్వం రెండేళ్ళు ఓపిక పట్టినా ఫలితం లేకపోయింది. ఇక పస్తాయిస్తే లాభంలేదని మంత్రివర్గం సమావేశమైంది.

"పరిస్థితి విషమిస్తోంది" అన్నాడు వృద్ధ మంత్రి.

"రైతుల కష్టనిష్ఠురాలు ఇకనైనా పట్టించుకోక తప్పదు. రైతు దేశానికి వెన్నెముక." అన్నాడు వ్యవసాయశాఖామంత్రి.

అధ్యక్షస్థానంలో కూర్చున్న మందర మహారాజుగారు ఆ మంత్రి వంక సూటిగా చూశారు.

"ఆ రైతులూ అదేమాట. నువ్వూ అదేపాట. ఎంతసేపటికీ రైతు దేశానికి వెన్నెముకో అంటూ గోలపెడతారు. నాకు తెలీకడుగుతానూ– దేశానికి వెన్నెముక ఎలాగుంటుంది? దేశమేమైనా దేహమా!"

"చిత్తం తమరు చెప్పేదాకా ఆ విషయం నా మట్టిబుర్రకు తట్టనేలేదు సుమా!" అన్నాడు వ్యవసాయశాఖామంత్రి వినయంగా తన మట్టిబుర్ర గోక్కుంటూ.

''ఏది యేమైనప్పటికిన్నీ ఈ సమస్య తక్షణమే పరిష్కరించిపారెయ్యాలని నాకు మహోయిదిగా ఉంది. ఈ ఉద్యమం ఇలాగే వికటిస్తే ముందుముందు దేశ భద్రతకే ముప్పువాటిల్లుతుంది. పోనీ రైతుల డిమాండ్లు అంగీకరిద్దామా అంటే అదీ లాభంలేదు ఎరువుల ధరలు తగ్గిస్తే పరిశ్రమలు నష్టపోతాయి అది పరిశ్రమల్లో బతికే కార్మికులకే చావుదెబ్బ ఇక రైతుల పంటలకు మద్దతు ధరయిద్దామా వెంటన్నే సరుకుల ధరలు పెరిగిపోతాయి. ఆ భారమంతా మనప్రియమైన పేదప్రజల మీదే పడుతుంది పోనీ సన్నకారు రైతుల ఋణాలు మాఫీ చేద్దామా అంటే అలా చేసిన మర్నాడు రైతుకు అప్పులభయం ఉండదు సాగుబడి నిర్లక్ష్యంచేస్తాడు. సోమరిపోతులా తయారౌతాడు అదిరైతుకూ దేశానిక్కూడా గొడ్డలిపెట్టు. ఏతావాతా ఈ కోర్కెలు ససేమిరా ఆచరణ యోగ్యం కావు. ఇక యీ సమస్యకంతటికీ ఒకే ఒక పరిష్కార మార్గం నాకు తడుతోంది'' అని ఆగారు రాజుగారు మంత్రివర్గం మొహంలో కుతూహలం చూద్దామని.

మంత్రివర్గం నిజంగానే కుతూహలాన్ని ప్రదర్శించింది.

''ఆ చిట్కానేనిప్పుడు చెప్పను ఒకేసారి ఆచరించి చూపుతాను.'' అంటూలేచారు, మహారాజుగారు.

మర్నాడు మందరమహారాజుగారు ఆకాశవాణిలో దేశ ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తూ, దేశసంస్కృతి పరిరక్షణే యీనాడు జాతి నెదుర్కొంటున్న భయంకర సమస్య అనీ ప్రజల్లో నానాటికీ దేశభక్తి లోపిస్తోందనీ విచారపడ్డారు. అందుకు నిదర్శనం ఎన్నడో పొరుగుదేశం మనపై దండెత్తి అప్పటి మన అధినేత వీరాజీగారి సంపదనూ దేశసంపదనూ దోచుకుపోయినా మనం కిమ్మన్నాస్తిగా ఊరుకోవటమేనన్నారు. కాబట్టి యిప్పటికైనా ప్రజలు చిన్నాచితకా ఆందోళనలు మాని దేశసంస్కృతి రక్షణకు పునరంకితమై పొరుగుదేశంపై 'శాంతియుద్ధం'ప్రారంభించి మనదేశసంపదను తిరిగి తెచ్చుకోవాలని ఘట్టిగా 'నొక్కి' వక్కాణించారు.

వారం రోజుల్లో పొరుగుదేశం సరిహద్దుల్లో కవ్వింపు చర్యలు ప్రారంభించిందనీ ఆ దేశమే యుద్ధాన్ని రెచ్చగొడుతుందనీ ఆకాశవాణిద్వారా దేశ ప్రజలకు తెలిసింది. చినికి చినికి గాలివానై అంధక రాజ్యానికి బంధక దేశానికి భయంకర యుద్ధం ప్రారంభమైంది. ప్రజలు తమ సమస్యల్ని విస్మరించి రాజుగారు చెప్పినట్టు దేశభక్తికి పునరంకిత మయ్యారు. యుద్ధనిధి పోగైంది. యువకులు సైన్యంలో చేరారు. నెలరోజుల యుద్ధం పిమ్మట దేశం సంపూర్ణవిజయం సాధించిందని

పూర్వం కోల్పోయిన ప్రాచీన సంస్కృతి సంపదనుగూడా బస్తాల కెత్తించి యుద్ధ రంగంనుంచి తిరిగి తెస్తున్నారనీ ఆకాశవాణి, సువార్తా పత్రికలు ప్రకటించాయి. దేశ ప్రజలు పండగచేసుకున్నారు. మందరమహారాజుగారు తమ నల్లకోట బురుజుపై నిలబడి జాతి నుద్దేశించి గంభీరోపన్యాసం ఇచ్చారు. పిమ్మట పక్కనే ఉన్న వృద్ధ మంత్రి యుద్ధంలో సాధించిన దేశ ప్రాచీనసంస్కృతి వైభవాన్ని ప్రదర్శించటానికి పూనుకున్నాడు. ఒక పెద్ద భోషాణంలోంచి చిన్న చిన్న పెట్టెలెన్నో – ఒక దాన్లో నుంచి మరొకటి – తీస్తూ చివరి కోబొట్టుపెట్టెలోంచి ఏదో వస్తువును తీసి రెండు వేళ్ళతో పదిలంగా పట్టుకొని ప్రజలందరికీ ప్రదర్శించాడు – దేవుడి హారతిలాగా.

"ఇది పూర్వం బంధకదేశ దండయాత్రలో వీరాజీమహారాజుగారు పరాజితు లైనప్పుడు మనం కోల్పోయిన ప్రాచీన సంపద. ఇది వీరాజీవారి వీరవెంట్రుక. దీన్ని తిరిగి సాధించి దేశ సంస్కృతిని రక్షించుకో గలిగినందుకు మనం తప్పకుండా సంతోషించాలి."

వృద్ధమంత్రి చేతిలో దేమిటో ప్రజల కెవ్వరికీ కనబడకపోయినా సుదీర్ఘ హర్ష ధ్వానాలతో నల్లకోట మారుమోగిపోయింది. ప్రజలంతా దేశ సమస్యల సంగతి మర్చిపోయి శ్రీమాన్ మందరమహారాజుగారు సాధించిన ఈ మహా విజయాన్ని పదేళ్ళపాటు ఆ గుబ్బుగా చెప్పుకున్నారు.

– 59వ పేజీ తరువాయి

వున్న విప్లవకారులకి పోలికవుందా? ఇవన్నీ ఆలోచిస్తే రివిజనిజం భయంకరంగా మారి, విప్లవ రచయితల్నికూడ ప్రలోభాలతో తన వలలోకి లాక్కోవా లనుకుంటున్న కుట్ర. దీన్నుంచి తప్పించుకోవాలంటే రచయితకు తగినంత నిబద్ధత వుండాలి. ప్రజల పోరాటాలు ఊపిరిగా తీసుకుంటే రివిజనిజం గోతిలో పడే అవకాశాలు తక్కువ.

'మాభూమి', 'తన్నీరు తన్నీరు' (తమిళం) లాంటి సినిమాల్లో వున్న గొప్పవిశేషం ప్రజా నాయకత్వం (Collective heroism of masses.) వీటిలో లోపాలున్నా అందించే సందేశముంది. 'విప్లవశంఖం' లాంటి చిత్రాల్లో 'సుత్తీ కొడవలి' 'ఎర్రచొక్కాలు' కమ్యూనిస్టు నినాదాలు తగిలిస్తే అయ్యేది విప్లవ సినిమాలు కాదు, దిష్టిబొమ్మలు. రివిజనిస్టు కళల వికృతరూపం 'మాదాల. మాదాల సినిమాకూడా. అంతే!

అంపశ్రీపై దౌర్జన్యం

మహబూబ్ నగర్ జిల్లా వి.ర.సం. యూనిట్ కన్వీనర్ అంపశ్రీ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. మక్తల్ తాలూకా కృష్ణగ్రామం జడ్.పి. హైస్కూల్లో 8,9 తరగతుల పరీక్షలకు 'ఇన్విజిలేషన్' చేస్తూ, ఆగ్రామ కరణంగారి కుమారుడు కాపీ కొడుతుంటే పేపర్లు తీసేసుకున్నాడు. కరణం పాండురంగాచారికి ఇది అవమానమనిపించింది. తన బలగాన్ని స్కూలుమీదికి తోలాడు. ఆ సమయానికి అంపయ్య- అంపశ్రీ-అక్కడలేరు. వచ్చినవాళ్ళు హెడ్మాస్టరు మీద నోరుపారేసుకు వెళ్ళారు. ఇది దినపత్రికలకు వార్తగా ఎక్కిందికూడా.

మరి కొన్నాళ్ళకు అంపశ్రీ తన ఉపాధ్యాయమిత్రుడితో కలిసి బజార్లో పోతుంటే, కరణం స్వయంగా తిట్లకు దిగాడు. వింటూవున్న జనం వూరుకోలేదు. తనకు తగిన రక్షణ లేదని జిల్లా కలెక్టరుకి యస్పీకి అంపశ్రీ టెలిగ్రాము లిచ్చాడు అర్జీలు పంపాడు. నారాయణపేట డీయస్పీ వచ్చి విచారించి వెళ్ళడం జరిగింది. కరణం అంపశ్రీమీద ఉన్నవీ లేనివీ రిపోర్టుచేసి, కమ్యూనిస్టనీ గ్రామపేదలను నాటక ప్రదర్శనలద్వారా గ్రామపెద్దలమీదికి రెచ్చగొడుతున్నాడని చెప్పాడు.

అక్కడితో వూరుకోకుండా, కృష్ణ గ్రామపంచాయితీ మెంబరు డింగిరి హనుమంతుకు తాగుబోయించి డబ్బిచ్చి అంపశ్రీ పనిచూడమని పురమాయించిన వాళ్ళలో, అంపశ్రీ కార్యకలాపాలవల్ల కోపగించివున్న మతవాదులు కొందరున్నారని అంపశ్రీ అంటున్నారు. హనుమంతు అంపశ్రీని ఏదో చేయడం తప్పి, హనుమంతుకి జనం బుద్ధి చెప్పడం, దేహశుద్ధి చేయడం జరిగింది. తనను ఎగదోలి పంపిన వారి పేర్లన్నీ అతడు కక్కేశాడు.

పేదసాదలకు వర్గ పోరాట చైతన్యం కలిగించే కార్యకలాపాలన్నిటిలోనూ అంపశ్రీ పాల్గొంటున్నాడనేది, ఆ గ్రామంలో విద్యావంతులైన మతవాదులకు చాలాకాలంగా గుర్రు కలిగించింది. ఆయనకు వ్యతిరేకంగా వారెన్నో కుట్రలకు దిగుతూవున్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్తులో అవినీతినీ అక్రమాలనూ రచ్చకీడుస్తున్నాడని, మేనేజరు అసభ్య ప్రవర్తనను ఖండిస్తున్నాడని ఆయనమీద కేసుకూడా నడుపుతూ వున్నారు. ఇప్పటికే అంపశ్రీని ఎన్నో స్థలాలకు బదిలీలు చేశారు. కృష్ణ అనేగ్రామం మారుమూలవుందిగనుక ఇక్కడికి పంపారు. ఇక్కడ కూడా అంపశ్రీ తన నిబద్ధతను కొనసాగిస్తూనే ఉన్నాడు.

సవరణలు

త్రికం

మే 82 అరుణతారలో 'త్రికం' మీద రాసిన వ్యాసంలో పెద్ద అచ్చు తప్పులు పడ్డాయి. సవరణలు దిగువన ఇస్తున్నాం.

పేజీ 8 పంక్తి 8లో- 'ఖండిస్తున్నారా ?' అనేమాట తర్వాత 'అభావం అభావం కావడాన్ని ఖండిస్తున్నారా ?' అనే వాక్యాన్ని చేర్చుకోవాలి. అదే పేరా చివరి పంక్తిలో 'వాళ్ళు' అనే దాన్ని వాక్యం ముందు చేర్చుకోవాలి.

పేజీ 10 లో - పంక్తి 6 లో 'పుట్టటం కాక' - అనే మాట తర్వాత 'భావనల నుంచీ వాస్తవాల్ని పుట్టించి అఖండ-' అనే దాన్ని చేర్చుకోవాలి.

అదే పేజీలో - 'అనిర్దిష్టం చేయటం ద్వారా....' అనే పంక్తి నుంచీ 12వ పేజీలోని 'ఇప్పటి వరకూ మనం హెగల్ గతితర్కాన్ని మాత్రమే విశదీకరించాం' అనే వాక్యం వరకూ కొటేషన్స్‌లో ఉండాలి. ఈ సుదీర్ఘమైన కొటేషన్, మార్క్స్ Poverty of Philosophy లోని First observations కి అనువాదం.

పేజీ 12 లో - 'ఏంగెల్సు లెనిన్ కూడా త్రికవిధానాన్ని ఆమోదించలేదు' అనే వాక్యం తర్వాత పేజీ 13 లో పడిన "భౌతికవాద చారిత్రిక క్రమాన్ని .... సూత్రాన్ని పరిశోధించాలి" అనే కొటేషన్ని చెర్చుకోవాలి. ఇది Lenin రచన "What the 'Friends of the People" Are and How they fight Social Democrats Part I. పేజీ 41లోని దానికి అనువాదం. ఈ కొటేషన్ తర్వాత 'గతితార్కిక విధానం పునాది కాదని చెప్పడమేకాక అసలు త్రిక విధానాన్నే ఏంగెల్సు, లెనిన్‌లు ఇద్దరూ ఖండించారని ఈ లెనిన్ వాక్యాలు రుజువు చేస్తున్నాయి' అనే వాక్యం చేర్చుకోవాలి.

దీని తర్వాత 'త్రికవిధానాన్ని మార్క్స్ ఏంగెల్సు లెనిన్‌లు ఖండించారని ....' అనే పేజీ 12 లోని పేరా చదువుకోవాలి.

పేజీ 13 లో పంక్తి 4 'మావో గతితార్కిక తర్కాన్ని విస్తరించాడు' అనే దాని తర్వాత, అదే పేజీలోని "విశ్లేషణా.... విపులంగా చేశాయి" అనే కొటేషన్ని చేర్చుకోవాలి. ఇది మనోరంజన్ మొహంతి రాసిన The Politi al Philosophy of MAO – Tse – Tung అనే పుస్తకంలోని పేజీ 174 లో ఉన్న దానికి అనువాదం. పేజీ 14 పంక్తి 13 లో 'అవకాశం' అనే మాట తర్వాత 'లేదు' అనే మాటని చేర్చుకోవాలి. పంక్తి 14 లో 'సంభవించెనే భావించినట్టు' అనే దాని స్థానంలో, 'భావించిందే సంభవించినట్టు' అనే మాటల్ని వుంచాలి.

రెండు అసందర్భాలు

'పదరా' కాస్త తొందరపడ్డాడు. ఈ వ్యాసం సీరియల్గా వస్తుంది నాకు తీరిక లేకపోతే ఎప్పుడయినా ఒక నెల రాకపోవచ్చు.

బ్రహ్మంగారు! రాడికల్ హ్యూమనిస్టు బులెటిన్ లో మీ 'అస్త్రగీతం' చదివాను. మీ మఠాధిపతిని రక్షించుకోవడానికి చాలా తత్తరపాటు పడుతున్నారు. తొందరలేదులెండి. అంతా రాసిన తర్వాత మన సంగతి చూసుకుందాం –

—త్రిపురనేని మధుసూదనరావు
తిరుపతి

'మౌనశంఖం' (సమీక్షావ్యాసం) లో పేజీ 55 పంక్తి 5 లో 'అధునాతనైన' అనే మాట తర్వాత అచ్చుపడింది ఫుట్నోట్గా వుండవలసింది. ఆ మాట తర్వాత పంక్తి 7 లో 'ఈ గ్రంథానికి' అనే మాటతో మొదలయ్యేదాన్ని చదువుకోవాలి. పేజి 56 పంక్తి9లో 'యాచకులో' బదులు 'యాచకో' వుండాలి పేజి 60 పంక్తి 4 లో 'అఫావిజం' బదులు 'అఫారిజం' వుండాలి. అదే పేజి పంక్తి 12లో 'అంతర్నషాదాల' బదులు 'అంతర్నినాదాలు' వుండాలి.

—కె. వి. ఆర్.

చెరబండరాజు సహాయనిధి

యం. కల్పన (సూర్యాపేట) 50/- (డి.డి.) రుద్రసన్యాసిరాజు - 9వ తరగతి, సెయింట్ ఆంథోనీస్ స్కూలు, విశాఖపట్నం రు. 5/- (యం వో) వి. ... నాగరావు (ఖరగ్పూర్) 20/- (యం ...).

KLDA101M102

UNA TA[illegible] H/GTR-70
JUNE - 1982
Annual Subscription Rs. 20-00 Price Rs. 2-00

గళాల కలాల లాంగ్‌మార్చ్

వీరారు వెలిగించిన దివిటీలతో
మేము తీరాలకేసి నడుస్తున్నాం
దారి పొడుగునా రక్తగానం చేస్తూ -

కట్లు తెంచుకుంటున్న జ్ఞాపకాలు
కంట్లో మొలిపిస్తున్న మసకదనంలో
కొత్త వూపిరి పోసుకుంటున్నాం
పోరు బాటలో రక్తతర్పణ చేస్తూ -

స్తైర్యం జ్వలిస్తోంది నాగేటి చాళ్ళల్లో
ప్రవహిస్తున్న త్యాగాల్లో
మీ పాట పాడుతున్నాం - ఎరుపులో ముంచి
పోరులో పంచి –

పల్లెల్లో గూడేల్లో ఉదయిస్తున్న
కొత్త సూరీని నెత్తుటి చరిత్ర
రాగాలాపన జేసేందుకు
ఝుళిపిస్తున్నాం కలాలు గళాలు సవరిస్తునాం!

జ్ఞానపథుష్వల జై లుగోడలు అడ్డమే కావని
కన్నీళ్ళు తుడుచుకు కదిలిపోతున్నాం
లాంగ్ మార్చ్!
లాంగ్ మార్చ్!

-శిల్పి

[కామ్రేడ్స్ పాణిగ్రాహి, పరిటాల, జ్ఞానేశ్వర్‌ల స్మృతి కెరటం]

Edited, Printed & Published by K. V. RAMANA REDDY.
Printed at Venkataramana Printers, Guntur-1
for Ushasree Printers, Vijayawada-2
REVOLUTIONARY WRITERS' ASSOCIATION

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M102
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Shanu sree
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good